

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

## మెహెర్‌స్థాన్ పసిడి పండుగ వేడుకలు ప్రత్యేక సంచిక


సంపుటి: 12 సంచిక: 10 హైదరాబాద్ 2013 ఫిబ్రవరి పేజీలు 60

Please visit: www.srimeherbaba.com

వార్షిక సభ్యత్వం: రూ. 100/-


50
మెహెర్ స్థాన్
స్వర్ణోత్సవ వేడుకలు
యుగావతారుడైన అవతార్ మెహెర్‌బాబా దివ్య ప్రేమాశీస్సులతో
26-2-2013 నుండి 28-2-2013 వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా,
కొవ్వూరు నందు అత్యంత వైభవంగా జరుగు "మెహెర్‌స్థాన్ స్వర్ణోత్సవాలకు"
భగవత్ ప్రేమికులందరికీ ఇదే మా హృదయ పూర్వక ఆహ్వానం
మెహెర్‌స్థాన్ సహవాస్ కమిటీ
బాబా ప్రేమతో ఆహ్వానించువారు
కోడూరి శివరామకృష్ణ తులసీవరప్రసాద్



## బాబా సందేశం

The real untouchbles are those who cannot entre the temples of their own hearts and see the Lord therein.

**తమ హృదయ మందిరాలలో ప్రవేశించి, లోపల నున్న దైవాన్ని దర్శించలేని వారే నిజమైన అస్పృశ్యులు.**

**- మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. అమరతిథి విశేషాలు 6-7
3. మెహెర్‌స్థాన్ పసిడి పండుగ వేడుకలు 8-11
4. నమ్మలేని నిజం! మా భాగ్యం 12-13
5. తెలుగునాట మెహెర్ బాబా కార్యక్రమాలు 14-15
6. శ్రీమతి శాంతాదేవి మహారాణి సందేశం 16-18
7. మెహెరుని మధురవాక్కులు 19-31
8. మెహెర్‌బాబా కార్యక్రమాలు ఎలా చేపట్టాలి? 32-36
9. స్వాగత గీతం 37
10. మా మాటలు 38
11. శ్రీ కోడూరు కష్టారావు 39-47
12. అర్ధ శతాబ్దిలో... 48
13. అమర్‌సింగ్ సైగల్ 49
14. పండగమ్మ పండగే 50-51
15. లార్డ్ మెహెర్ 52-57

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

Please visit : www.srimeherbaba.com

# మెహెర్‌బాబా 119వ జన్మదినోత్సవాలు

## మార్చి 3 ఉ. 8 నుండి 12 వరకు రక్తదాన శిబిరం




అవతార్ మెహెర్‌బాబా జన్మదినోత్సవాల ముగింపు సందర్భంగా 2013 ఫిబ్రవరి 23 నుండి 25 వరకు హైదరాబాద్‌లో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ పి. రాజేంద్రమెహెర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**2013 ఫిబ్రవరి 25** తెల్లవారురఝామున 5 నుండి మ. 12 వరకు జూబ్లిహిల్స్ బాబా సెంటర్‌లో బాబావారి ప్రార్థనలు బర్త్‌డే ప్రత్యేక వేడుకలు, తిరిగి సా. 6 నుండి 8.30 వరకు కోఠి – ఈసామియా బజార్‌లోని బాబా సెంటర్‌లో బాబా జన్మదిన వేడుకలు, **2013 మార్చి 3** ఉ. 8 నుండి 12 వరకు రక్తదాన శిబిరం కోఠి సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాగా, **ఫిబ్రవరి 23** సా. 5 నుండి 8 వరకు మల్కాజిగిరి సెంటర్‌లో, ఫిబ్రవరి **24** సా.6 నుండి 8 వరకు సికింద్రాబాద్ సెంటర్‌లో జన్మదిన ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు రాజేంద్ర మెహెర్ తెలిపారు.

# శ్రీకాకుళంలో యువజన సమ్మేళనం

## 2013 మే 9 నుండి 12 వరకు

2013 మే 9 నుండి 12 వరకు శ్రీకాకుళం బాబా సెంటర్ ఆధ్వర్యంలో యువత కోసం ప్రత్యేక ఆధ్యాత్మిక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేవలం 70 మంది యువతీ యువకులకు మాత్రమే అవకాశం కలదు. 18 – 35 సం॥ వయస్సులోపు గల ఆసక్తి గల వారు తమ వివరాలను 2013 మార్చి 10లోగా **e-mail: amb.sklm2011@gmail.com** నమోదు చేయించుకోవల్సిందిగా శ్రీ పి.వి. రంగ ప్రసాద్, (99850 26433) కోరుతున్నారు.

అవతారుని సందేశాలపై, ప్రవచనాలపై చక్కని అవగాహన కల్పించగల ఈ యువజన సమ్మేళనంలో యువత తప్పక పాల్గొనాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# సంపాదకీయం గతం భవిష్యత్తుకు మార్గం..

మెహెర్‌స్థాన్ స్వర్ణోత్సవాలు 2013 ఫిబ్రవరి 26 నుండి 28 వరకూ అత్యంత వైభవంగా జరుపుకోవడానికి సన్నద్ధమౌతున్న వేళ ఇది. దేశం నలుమూలల నుండీ సుమారు 5 వేలమంది బాబా ప్రేమికులు ఈ వేడుకలలో పాల్గొనడానికి విచ్చేస్తున్నారని ప్రాథమిక అంచనా. 2013 ఫిబ్రవరి 25న అవతారుని జన్మదినమైంది. ప్రతి బాబా సెంటర్‌లో ఆ వేడుకలు ఘనంగా జరుపుకుని ఆ మర్నాడు అందరూ కొవ్వూరు వెళ్ళేందుకు సిద్ధమౌతున్నారు. మెహెర్‌స్థాన్‌లో ఆ మూడు రోజులపాటు బాబా సందేశాలపై ప్రసంగాలు, భజనలు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ వేడుకల మధురస్మృతులపై ప్రసంగాలు ఏర్పాటు చేశారు. ఆ వేడుకలలో పాల్గొన్న వారు నేడు చాలా తక్కువమంది మన మధ్యన వున్నారు. ఆనాటి సంగతులు మనం తప్పక తెలుసుకోవాలి.

**గతం భవిష్యత్తుకు మార్గం అయితే, నవతరానికి ఈ తరం మార్గగాములు కావాలి!**

బాబా ప్రేమికలోకానికి అవతారుడు అందించిన దివ్యధామం మెహెర్‌స్థాన్. ఇది మెహెరుని ప్రసాదం..మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ వేడుక ఓ ప్రేమ పండుగ. కొవ్వూరు వెళ్ళండి ఆ ఆనందం పంచుకోండని స్వయంగా మెహెర్‌బాబా తన ప్రేమికులెందర్నో పేరుపేరునా ఆనాడు ఇక్కడకు పంపారు. ఆ ఏడాది బాబా తన పుట్టినరోజు వేడుకలు జరుపుకోలేదు. మెహెర్‌స్థాన్ వేడుకలనే తన జన్మదినోత్సవంగా భావించమన్నట్లు సంకేతాలున్నాయి. ఈ ప్రారంభోత్సవ వేడుకలకు మెహెర్‌బాబా ఇచ్చిన 8 సందేశాలు ఆచంద్రార్కం చిరస్మరణీయం. ఆ సందేశాల సారాంశం ఏమిటో కూడా బాబా చాలా వివరంగా చెప్పారు. నేటికీ ఆ సందేశాలు మనందరికీ మార్గదర్శకం. రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తాయి. గత అర్థ శతాబ్ధిగా మెహెర్‌స్థాన్ ప్రస్థానంలో ఎన్నో మధురానుభుతులు చోటుచేసుకున్నాయి. 2013 ఫిబ్రవరి 26-28లలో జరుపుకోనున్న పసిడి పండుగ వేడుకలలో గత 50 సంవత్సరాలుగా మెహెర్‌స్థాన్‌లో నిర్వహించిన బాబా కార్యక్రమాలను ఒకసారి సింహావలోకనం చేసుకోవాలి. అలాగే 1963 మార్చి 1న, అంటే మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ వేడుకలు లాంఛనంగా పూర్తయిన మర్నాడు బాబా కార్యదర్శి ఆదీ కె ఇరానీ అధ్యక్షత **బాబా కార్యక్రమాలు ఎలా నిర్వహించాలి? అనే అంశంపై** చర్చా గోష్ఠి జరిగింది. పలువురు పలురకాల అభిప్రాయాలు వెల్లడించారు. ఆనాటి వారి అభిప్రాయాలు నేటికీ శిరోధార్యమే. 50 వసంతాలు గిర్రున తిరిగినా ఈ అంశంపై నేటి బాబా ప్రేమికులందరూ పునరాలోచించాలి. నేడు జరుగనున్న స్వర్ణోత్సవ వేడుకలలో ఈ అంశానికి తావులేకుండింది. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో హాజరవుతున్న ఈ వేడుకలలో చివరిగానైనా ఈ అంశానికి తగిన ప్రాధాన్యత కల్పించి సమీక్షించుకోవడం అత్యవసరం.

# అమరతిథి విశేషాలు

44వ అమరతిథి ఎంతో వేడుకగా, ఘనంగా జరిగింది. దేశం నలుమూలల నుండి సుమారు 20 వేల మంది బాబా ప్రేమికులు మెహెరాబాద్‌లో వసతి కోసం నమోదు చేసుకున్నారు. కాగా మరో 20 వేల మంది అహ్మద్‌నగర్, ఆ చుట్టుప్రక్కల గ్రామాల నుండి అమరతిథి రోజున అవతారుని దర్శనం చేసుకున్నారని ఒక అంచనా!

అమరతిథి రోజున ముందుగా ఇచ్చిన టోకెన్ల ద్వారా బాబావారి దర్శనం చేసుకున్నారు. వృద్ధులు, అనారోగ్యంతో వున్న వారికి ఎలాంటి క్యూ లేకుండా బాబావారి దర్శనం వాలంటీర్లు ఇప్పించారు. ఈ దఫా యువతరం అలాగే మహిళలు అధిక సంఖ్యలో అమరతిథికి హాజరయ్యారు. ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్త్రీ - పురుష హాస్టళ్ళల్లో వసతి సౌకర్యం కంప్యూటరీకరించారు. రాబోయే రోజుల్లో బాబా దర్శనానికి ఇచ్చే టోకెన్లు మంజూరు విషయంలో కూడా కంప్యూటర్ల వినియోగం అధికం చేయడానికి, 'ఆన్‌లైన్ సౌకర్య ప్రతిపాదన' ప్రయత్నిస్తున్నట్లు శ్రీ రాజేంద్ర మెహెర్, హైదరాబాద్ తెలిపారు.

ఆనారోగ్యం కారణంగా ట్రస్టు చైర్మన్ భావూజీ మెహెరాబాద్‌కు రాలేదు. ట్రస్టు చైర్మన్ హోదాలో భావూజీ ఇచ్చే స్వాగత వచనాలను మరో ట్రస్టీ సభ్యులు చదివి వినిపించారు.





ఆ స్వాగత వచనాలు చాలా క్లుప్తంగా వున్నాయి. అంటే భావూజీ ప్రసంగంలో ఉండే చక్కని బాబా సందేశం ఈ దఫా పూర్తిగా కొరవడిందని పలువురు అభిప్రాయపడ్డారు. మరో విషయం అమరతిథి మూడ్రోజుల కార్యక్రమాల సంధానకర్తగా వ్యవహరించే ఎల్.బి. థాడే వయస్సురీత్యా ఇకపై తాను ఆ బాధ్యతలు నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. జనవరి 31న మధ్యాహ్నం 12 నుండి 12:15 వరకు బాబా ప్రేమికులు మౌనం పాటించారు. అంతక్రితం ట్రస్టు సభ్యులు శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ విచ్చేసిన బాబా ప్రేమికులకు స్వాగతం పలికారు. తెలుగులో పర్వద్గిగార్ ప్రార్ధనను శ్రీమతి పద్మావతి, అవతారుని **దేవాది దేవ ఆరతి** శ్రీమతి నాగలక్ష్మి, హైదరాబాద్ ఆలాపించారు. ప్రేమావతారుని సన్నిధిలో అమరతిధి వేడుకలు ఘనంగా ముగిసాయి. కాగా ఆంధ్రా రెస్టుహౌసులో 450 మందికి భోజన వసతి సౌకర్యం కల్పించారు. ఎక్కువ మంది వయస్సు మళ్ళినవారు, మహిళలు, ఆంధ్రా వసతి గృహంలో తమ సొంత ఇంటిని వదలి వచ్చామన్న విషయాన్ని మరచి సుఖంగా అవతారుని సమక్షంలో గడిపారు. మెహెరాబాద్‌లో తీవ్ర ఎద్దడి వున్నా ఆంధ్రా వసతి సౌకర్యంలో ఆ లోటు ఎక్కడా కనపడనీయ లేదు, కార్యదర్శి శ్రీ వై. యస్. రావ్ అని చెప్పాలి. మహిళలు తలస్నానాలుతో సరిపెట్టుకోలేదు. దుస్తులు పిండి ఆరేసారు. న్యూ సైట్‌లోని వాలంటీర్లు సయితం ఇక్కడ స్నాన పానాదాలు ముగించారు. రమారమిన 40 ట్యాంకర్లు నీటిని కొనుగోలు చేశామన్నారు. కాగా ఇందుకయిన ఖర్చును శ్రీ హనుమంతరావు (ఎల్.ఐ.సి), హైదరాబాద్, చెల్లించినట్లు ప్రకటించారు.

ఆంధ్రా రెస్టుహౌస్ ఏర్పాటుచేసిన **24×7 ఉచిత ఆటో సౌకర్యం** వృద్ధులకెంతో సౌలభ్యంగా, అవతారుడు తమకు కల్పించిన సౌభాగ్యంగా వుందని మెచ్చుకున్నారు.

# మెహెర్‌స్థాన్ పసిడి పండుగ వేడుకలు




మెహెర్‌స్థాన్ పుణ్యక్షేత్రం మెహెర్ ప్రేమికులకు పావన క్షేత్రం.

అవతారుడు ప్రజా దర్శనం ఇచ్చిన పావన గోదావరి ఒడ్డున వెలసినదీ దివ్య మందిరం.

మెహెర్‌స్థాన్ **అంటే మెహెరుని ఇల్లు.**

ఆ ఇంటిని కట్టి తరించిన పుణ్యాత్ముడు శ్రీ కోడూరి కృష్ణారావు.

శ్రీ కోడూరికి బాబా గుడికట్టాలన్న సంకల్పం కల్గింది.

ఇవ్వటమే తప్ప ఏదీ అడిగే అలవాటులేని ఆ పెద్దమనిషి స్వంత ఖర్చుతో కట్టాడీ ఇల్లు మెహెరుని కోసం.

తమ పాదాల వద్దకి చేరిన ప్రతివారినీ ఆటపట్టించడం, ముక్కు పిండి ఏడిపించడం, ముప్పుతిప్పలు పెట్టడం, దిక్కు తోచకుండా చేయటం, గాభరా పడుతుంటే దగ్గరకు తీసి లాలించడం ఈ యుగావతారుడైన అవతార్ మెహెర్‌బాబాకు ఓ సరదా.

ఆ సరదాని తట్టుకొని నిలబడ్డ శ్రీ కోడూరి తమ మనోవాంఛని నెరవేర్చుకోగలిగాడు.

మెహెర్‌స్థాన్ నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమాన్ని 1960 ఫిబ్రవరి 25గా ఖరారు చేశారు.

ఈ తేదీని కూడా అవతార్ మెహెర్‌బాబా స్వయంగా నిర్ణయించారు.

**1960, ఫిబ్రవరి 25.**

ఆనాడు అవతారుని జన్మదినం అయింది.

మహాశివరాత్రి పర్వదినం.

1960 ఫిబ్రవరి 25 తెల్లవారుఝామున 5 గంటలకు బాబా జన్మకాల సమయంలో, శంఖుస్థాపన మహోత్సవం వైభవంగా జరిగింది.

ఆ దరిమిలా, సరిగ్గా మూడు సంవత్సరాలకు మెహెర్‌స్థాన్ నిర్మాణం పూర్తిచేసుకుని



బాబా ప్రేమికులందరికీ అంకితం చేశారు. అందుకు మెహెరుడు స్వయంగా 1963 ఫిబ్రవరి 28 ఉదయం 7.32 నిముషాలకు ముహూర్తం నిర్ణయించారు.

ఆనాడు మెహెర్‌స్థాన్ మందిరాన్ని మంగళవాయిద్యాల నడుమ, సుమారు 10 వేల మంది ప్రేమికుల జయ జయ ధ్వానాలతో ఈ మహోత్సవ వేడుకలు రంగ రంగ వైభవంగా, కన్నుల వైకుంఠంగా జరిగాయి.

ఈ కార్యక్రమానికి బాబా తన ప్రత్యేక ప్రతినిధులుగా బరోడా మహారాణి శ్రీమతి శాంతాదేవి, మెహెర్‌బాబా శిష్యుడు, కార్యదర్శి ఆదీ.కె.ఇరానీలను పంపారు.

కాగా, 2013 ఫిబ్రవరి 27 నాటికి ఈ వేడుకలు జరిగి 50 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా, మెహెర్‌స్థాన్ స్వర్ణోత్సవ వేడుకలను 2013 ఫిబ్రవరి 26,27,28 తేదీలలో ఎంతో వేడుకగా నిర్వహించేందుకు స్థానిక బాబా ప్రేమికులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దేశం నలుమూలల నుండి వేలాదిమంది బాబా ప్రేమికులు హాజరవుతున్న ఈ శుభసందర్భంలో మెహెర్‌బాబా పాఠకులకు ఐదు దశాబ్దాల క్రితం జరిగిన ఆ వేడుకల సమాచారాన్ని ఆనాటి రచనల ఆధారంగా సమగ్రంగా, సంక్షిప్తంగా అందించాలని ప్రయత్నిస్తోంది.

**2013 ఫిబ్రవరి మెహెర్‌బాబా సంచికను మెహెరస్థాన్ స్వర్ణోత్సవ ప్రత్యేక సంచికగా ప్రకటించి మీకు అందజేస్తున్నాం.** దయచేసి పరిశీలించండి!! స్పందించండి!! !!

**!!! !!! !!!**

బరోడా మహారాణి శ్రీమతి శాంతాదేవి 1963 ఫిబ్రవరి 28న ఉదయం 7.32 నిముషాలకు ఏడు రంగులు గల ఏడు రిబ్బన్‌లను కత్తిరించి మెహెరస్థాన్ మందిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

అదే సమయంలో మెహెరాజాద్‌లోని మండలి హాలులో బాబా తన ప్రేమికులందరినీ పిలిచి, వారి ఎదుట తానూ నిల్చున్నారు. సరిగ్గా 7.32 నిముషాలకు ప్రేమికులందరూ

ఏక కంఠంతో **ఓ పర్‌వర్ధిగార్!!** అని అవతారుడిని బిగ్గరగా స్తుతించారు. కాగా, మెహెర్‌స్థాన్ లో మెహెర్‌బాబా శిష్యుడు, కార్యదర్శి ఆదీ.కె.ఇరానీ సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఆనాడు మంగళవాయిద్యాల నడుమ, ప్రేమికుల జయ జయ ధ్వానాలతో ఈ మహోత్సవం కన్నుల వైకుంఠంగా జరిగింది. ఈ మహోత్సవంలో సుమారు 10 వేల మందికి పైగా భక్త జనులు పాల్గొన్నారు.

ప్రేమికులు చాలామంది ఫిబ్రవరి 27 నాటికే కొవ్వూరు, మెహెర్‌స్థాన్ ప్రాంగణానికి చేరుకున్నారు. పూణే నుండి విచ్చేసిన బరోడా మహారాణికి, ఆదీజీకి బ్రహ్మాండమైన స్వాగతం పలికారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ లోని హమీర్‌పూర్, డెహ్రాడూన్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుండి బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో విచ్చేసారు. మెహెర్‌బాబా వీరినందరినీ మెహెర్‌స్థాన్ వేడుకలకు హాజరుకావాలని ప్రత్యేకంగా కోరారు.

ఎస్.ఆర్. సింగర్ పోరియా, కవి, యోగి, మహర్షి, సుద్ధానంద భారతి, అమర్‌సింగ్ సైగల్, డా॥ హెచ్.పి. భరూచా, కె.కె. రామకృష్ణన్, డా॥ సి.డి. దేశ్‌ముఖ్, మధుసూధన్, సుభద్ర, ఎమ్.ఎమ్. సాఖరే ఇలా ఎందరో ఆనాటి కార్యక్రమానికి విచ్చేసారు.

అలాగే శ్రీ మొసలికంటి తిరుమల రావు, శ్రీ

**మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ సందర్భంగా ఫిబ్రవరి 27న మెహెర్‌బాబా శ్రీ కోడూరి కృష్ణారావుకి పంపిన సందేశం**

## BELOVED BABA'S BLESSINGS

**Ahmednagar, 27 Feb. 63**

You are blessed in your love for me. The love of my lovers gathered in Kovvur for the Opening of Mehersthan on 28th February 1963 has filled Mehersthan with my presence for I abide where my lovers are. I give my blessing to Mehersthan and to all who have made this pilgrimage to Kovvur to welcome me.

**- Avatar Meher Baba**

## నా యందు మీకు గల ప్రేమచే మీరు ధన్యులైనారు.

1963 ఫిబ్రవరి 28 కొవ్వూరు నందు "మెహెర్‌స్థాన్" ప్రారంభోత్సవ కార్యక్రమంలో సమావేశమైన నా ప్రేమికుల ప్రేమచే మెహెర్‌స్థాన్ అంతయును నా సాన్నిధ్య ప్రాప్తిని కలిగించిన మహత్తుచే నింపివేయబడినది. ఎందుకంటే, నా ప్రేమికులు ఎచ్చటనుందురో నేను అక్కడనే ఉందును కదా! "మెహెర్‌స్థాన్"కు, నాకు సుస్వాగతం పలకడానికై కొవ్వూరునకు వచ్చిన వారందరికీ నా ఆశీస్సులు

**– అవతార్ మెహెర్ బాబా.**

జి.యస్.ఎస్. మూర్తి, శ్రీ ఎ.సి.ఎస్.చారి, శ్రీ బాలగోపాల భాస్కరరాజు, శ్రీ తాడిమేటి కుటుంబశాస్త్రి, శ్రీ శంకర శ్రీరామారావు, డా॥ తోట ధనపతిరావు నాయుడు, శ్రీ పైడి లక్ష్మయ్య, శ్రీ వి.వి.నారాయణరావు, శ్రీ ధర్మారావు, శ్రీ కె.వి. సూర్యనారాయణ, శ్రీ శివుడు శివరావు, శ్రీ రేలంగి అప్పారావు, శ్రీ ఎ. వెంకటప్పయ్య, శ్రీ మంచాల బుచ్చిలింగప్ప శాస్త్రి, శ్రీ బందెల బాపిరాజు, శ్రీ మాజేటి రామ్మోహనరావు, శ్రీచింతా సర్వారావు ప్రభృతులుతోపాటు ఆనాడు తెలుగునాట గల అన్ని బాబా సెంటర్ల నుండి సుమారు 3 వేల మందికి పైగా బాబా ప్రేమికులు హాజరయ్యారని అంచనా.

మధ్యాహ్న కార్యక్రమంలో బాలగోపాల భాస్కరరాజు బృందంవారి బుర్రకథ, పలు బాబా సెంటర్ ప్రేమికుల భజనలు, కీర్తనల ఆలాపన, ఆకాశవాణి కళాకారుల నాదస్వర కాలక్షేపం, ఏలూరు సెంటర్ బాలలచే **'మెహెర్ లీల'** నృత్య నాటక ప్రదర్శన జరిగాయి.

ఆనాటి సాయంత్రం 6.45 నుండి రాత్రి 9 వరకు పుర వీధుల గుండా ఎత్తైన రథంపై బాబా చిత్రపటం వుంచి అద్భుతమైన నగర సంకీర్తన చేశారు.

బాణాసంచాలు పేల్చారు.

మెహెర్‌బాబా అధిరోహించిన వాహనానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు.

ఈ వాహనం ముందర ప్రేమికుల నృత్యాలు చేస్తూ, లయబద్ధంగా భజనలతో ముందుకు సాగారు. రాత్రి 10.30 నుండి 12 వరకు ప్రాక్ పశ్చిమ సమ్మేళనం, బాబా దర్శన కార్యక్రమాలపై చలనచిత్ర ప్రదర్శన జరిగింది. రాత్రి 12 నుండి 2 గంటల వరకు శ్రీ అమ్ముల విశ్వనాధ భాగవతార్‌చే హరికథా గానం, అనంతరం నాగపూర్ నుండి విచ్చేసిన బాబా ప్రేమికులు డా॥ సి.డి. దేశ్‌ముఖ్ ప్రసంగం, భజన బృందాలవారి కీర్తనల ఆలాపన తెల్లవారుఝామున 5 గంటల వరకు కొనసాగింది.

ఆ మర్నాడు అంటే మార్చి 1న ఉదయం 8 నుండి 12 గంటల వరకు అఖిల భారత బాబా ప్రేమికుల సమ్మేళనం జరిగింది.

ఈ సమ్మేళనంలో బాబా కార్యక్రమాలను ఏ రీతిన చేపట్టాలి, బాబా నామవ్యాప్తిని ఎలా కొనసాగించాలన్న విషయమై పలువురు బాబా ప్రేమికులు ప్రసంగించారు.

ఈ కార్యక్రమానికి ఆదీజీ అధ్యక్షత వహించారు.

బాబా కార్యక్రమాలను నియమబద్ధంగా నిర్వహించడానికి అవసరమైన అనేక సలహాలు, సూచనలు పలువురు వక్తలు సూచించారు.

ఆనాటి వారి సూచనలు నేటికీ ఆమోదయోగ్యంగా వున్నాయి.

ఆ వివరాలు ప్రత్యేక శీర్షికతో లోపలి పేజీలలో పరిశీలించండి.

ఆ మాదిరిగా ఆనాటి కార్యక్రమం ఎంతో ఆనందంగా, అపూర్వరీతిలో జరిగింది.

ఇక కోడూరి వారి ఆతిధ్యం **న భూతో నభవిష్యతి** అన్న రీతిలో వుంది.

# నమ్మలేని నిజం! మా భాగ్యం!!

ఎ.ఎస్. జగన్నాద్ - హైదరాబాద్
యం. సత్యనారాయణ - విశాఖపట్నం

1963 ఫిబ్రవరి 28, మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ వేడుకలకు వేలాది ప్రజానీకం పెద్దఎత్తున తరలివచ్చారు. వారందరికీ భోజన / బస ఏర్పాట్లలో శ్రీ కోదూరి తలమునకలై వున్నారు. ఊపిరి సలపని స్థితి ఆయనది. శ్రీ మాణిక్యాలరావుతోపాటు మొత్తం ఓ 10 మందిమి విజయవాడ నుండి కొవ్వూరు వెళ్ళాం. తలాం స్టూడియో, ముంబాయి నుండి వచ్చిన బాబావారి కాంశ్య విగ్రహాన్ని చూద్దామని కోదూరి వారింటికి వెళ్ళాం. అప్పుడు టైం చూస్తే తెల్లవారుఝామున 3 గంటలు అవుతోంది.

తెల్లవారితే ఉ. 7.32 ని॥లకు బాబా విగ్రహావిష్కరణ. విగ్రహానికి వున్న ప్యాకింగ్ ఇంకా ఊడతీయలేదు. ప్లాస్టిక్ కవర్ కప్పి వుంది. ఆ కవర్‌కే చిన్నపాటి కంతలుచేసి బాబా విగ్రహాన్ని చూసి ఆశ్చర్యపడ్డాం. కొత్తగా వచ్చిన విగ్రహమది. ధగ, ధగ మెరిసిపోతున్నాడు అవతారుడు. కొద్దిసేపు బాబా విగ్రహాన్ని చూస్తూ అలా అక్కడే వుండిపోయాం!! ఐతే, మరో నాలుగైదు గంటల్లో విగ్రహ ప్రతిష్ఠ జరగాలి. కానీ ఇంకా బాబావారిని శ్రీ కోదూరి వారింట్లోనే వుంచారు. ఎప్పుడు తీసుకెళ్తారు. అక్కడ ఏర్పాట్లు



ఎప్పుడు చేస్తారు! మాలో మేమే ఇలా తర్జనబర్జన పడి మాణిక్యాలరావు గారిని కోడూరి వారిని అడగమని ఆయన దగ్గరకు పంపాం!! ఫరవాలేదు లెండి! అన్నీ జరుగుతాయి. విగ్రహాన్ని తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు శ్రీ కోడూరి.

ఆయన బిజీ బిజీగా వున్నారు.

కొవ్వూరు చుట్టుప్రక్కల గ్రామాల నుండి వేలాది ప్రజానీకం నేల ఈనినట్లు తరలివస్తున్నారు. వారికి తగిన ఏర్పాట్లులో కోడూరికి నిజంగా తీరికలేదు.

ఇలా అనుకుంటుండగానే తెల్లవారు ఝామున 4 గంటలు కొట్టింది.

ఇంకేమాత్రం జాప్యం చేయరాదని, తొందరపడాలనుకున్నాం.

ఆ రోజుల్లో నాకు 30 ఏళ్ళుంటాయి. శ్రీ సత్యన్నారాయణకయితే 26 ఏళ్ళ కంటే తక్కువే! అని శ్రీ జగన్నాధ్ అన్నారు.

ఉడుకు రక్తం.

బాబా విగ్రహ తరలింపు విషయమై తొందరపడాలని, మరోమారు కోడూరి వారి దగ్గరకెళ్ళి హెచ్చరించమని మాణిక్యాలరావు గారిని పంపాం.

ఈసారి కోడూరి మీరేం చేస్తారో చేయండి! మీ ఇష్టం! అని ఆయనకున్న పని ఒత్తిడిలో చికాకు పడ్డారు.

దాంతో మేం నడుం బిగించాం!! విగ్రహానికున్న ప్యాకింగ్ అంతా తీసేసాం. విగ్రహానికి రెండు వైపులా నలుగురం చొప్పున అవలీలగా ఎత్తి కోడూరివారి ఇంటి నుంచి బయట వరకు తీసుకొచ్చాం. విగ్రహం బరువు అంతగా వుంటుందనుకోలేదు. సునాయాశంగా తీసికెళ్ళిపోగలమనుకున్నాం. సగం దూరం వెళ్ళేసరికి మాశక్తి సన్నగిల్లింది. సుమారు 500 కిలోల బరువున్న కాంశ్య విగ్రహమది. ఇక తప్పదు కొన్ని క్షణాలు విగ్రహాన్ని నేలపై వుంచితీరాల్సిన పరిస్థితిలో వున్నాం. బాగా అలసిపోయాం. ఆ స్థితిలో అడుగు ముందుకు సాగడం లేదు. ఐతే, విగ్రహాన్ని క్రింద పెట్టాలంటే, అందరం ఏక సమయంలో క్రింద పెట్టాలి. ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా చేతులు తెగిపోతాయి. భయం, భయంగానే విగ్రహాన్ని నెమ్మదిగానే క్రిందపెట్టాం. ఎంత జాగ్రత్తగా వున్నా మాలో ఒకని చెయ్యి విగ్రహం క్రిందనే వుండిపోయింది. ఏమయితేనేం నెమ్మదిగా అతని చేతుల్ని తొలగించాం అని శ్రీ సత్యన్నారాయణ చెప్పారు. ఈయన **మెహెర్‌బాబా వేషధారి** హరిమెహెర్ తండ్రి. ప్రస్తుతం విశాఖలో వుంటున్నారు. ఆశ్చర్యం ఏమంటే అంత పెద్ద బరువు గల విగ్రహం రెండు చేతులపై పడినా ఆతని చేతికి ఏమంత గాయం కాలేదు. అది అవతారుని మహిమ కాక మరేమౌతుంది. ఆ తర్వాత జైబాబా అని జై జై నాదాలు చేసుకుంటూ ఉదయం 6 గంటలలోపే మెహెర్‌స్థాన్‌లో బాబాను కూర్చోబెట్టాం. ఆ తదుపరి అన్ని కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయని పాఠకులందరికీ తెలుసుకదా! అని **ఎ.ఎస్. జగన్నాధ్ ఆశ్చర్యం కల్గించే నమ్మలేని నిజాల్ని తెలియచేశారు!!**

# తెలుగునాట మెహెర్‌బాబా కార్యక్రమాలు

తెలుగు నేలపై మెహెర్‌బాబా కార్యక్రమాలు 1950వ దశకం నుండీ ప్రారంభమైనాయని చెప్పాలి. క్లుప్తంగా ఆ సమాచారాన్ని వీక్షించండి.

## 1952 జూన్‌లో

ప్రప్రథమంగా మెహెర్‌బాబా తన నామవ్యాప్తికై ఇద్దరు మండలి సభ్యులు ఏరుచ్, పెండూలను **1952 జూన్‌లో** ఆంధ్రా ప్రాంతానికి పంపారు. ఆ సమయంలో బాబా అమెరికా దేశ పర్యటనలో వున్నారు. మండలి సభ్యులకు డా॥ టి. ధనపతిరావు నాయుడు, తాడేపల్లిగూడెం స్వాగతం పలికారు. తెలుగునాట తొలి బాబా ప్రేమికుడు డా॥ టి. ధనపతిరావ్ నాయుడని పాఠకులందరికీ తెలుసు. బాబా విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి మెహెరాజాద్‌కు వచ్చాక, **1952 అక్టోబరు 5 ఆదివారం** నాడు ఉభయ గోదావరి జిల్లాల నుండి శ్రీ తాడిమేటి సూర్య కుటుంబశాస్త్రి, డా॥ ధనపతిరావు నాయుడు, శ్రీ వై. రంగారావు, శ్రీ కె. సుబ్రహ్మణ్యం శాస్త్రి, శ్రీ సి. కొండలరావు, శ్రీ సి.హెచ్. మల్లిఖార్జునరావులు బాబాను దర్శించుకున్నారు. తెలుగునాట స్థానిక ప్రజానీకానికి బాబావారి దర్శన భాగ్యం గురించి వారు ఆనాడు చర్చించారు. ఆ సమయంలోనే హమీర్‌పూర్ పర్యటన విషయాలపై చర్చించడానికి గాను కేశవ్‌నారాయణ్ నిగం, పుకార్‌జీ తదితరులు మెహెరాజాద్‌లో బాబా సమక్షంలో వున్నారు. అలా బాబా దగ్గరకి వెళ్ళిన తొలి ఆరుగురు తెలుగువారిలో డా॥ ధనపతిరావు నాయుడు తప్ప మిగిలిన వారందరూ క్రొత్తవారే. బ్లూ బస్ వెనకాల ఈ సమావేశం జరిగింది.

## 1953 జనవరి 16.. బాబా ప్రథమ పర్యటన

కాగా, **1952 నవంబరులో** ఆంధ్రా నుండి మరోసారి 28 మంది అహ్మద్‌నగర్‌కు వెళ్ళి మూడురోజులపాటు బాబా సమక్షంలో గడిపారు. ఆ దరిమలా వారందరూ నిండైన బాబా ప్రేమతో తిరిగి స్వగ్రామాలకు వచ్చారు. ఆ తర్వాత, **1953 జనవరి 16న** తొలిసారిగా మెహెర్‌బాబా తన మండలి సభ్యులందరితో కల్సి మద్రాసు నుండి విజయవాడకు వచ్చారు. ఈ సందర్భంగా జనవరి 22న అవతారునికి స్వాగతం పలికేందుకు పశ్చిమగోదావరి జిల్లా వాసులకి ఒక అరుదైన అవకాశం లభించింది. కొవ్వూరులో శ్రీ కోడూరి కృష్ణారావు బాబాకు ఆతిధ్యం ఇచ్చారు. ఆనాడు స్థానిక హైస్కూల్లో 5 వేల మందికి పైగా బాబా దర్శనం చేసుకున్నారు.

ఆ పిదప, **1953 ఏప్రిల్‌లో** మండలి ప్రేమికులు ఏరుచ్, పెండూలు తిరిగి ఆంధ్రాకు వచ్చారు. ఈ పర్యటనలో బాబా కార్యక్రమాల నిర్వహణపై వారు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

**1953 సెప్టెంబరు 7న** డెహ్రాడూన్‌లో మెహెర్‌బాబా ప్రకటించిన **ఉన్నతోన్నతుడను (Highest of the High)** ప్రకటనతో స్థానిక బాబా ప్రేమికులందరికీ అవతారునిపై ఒక చక్కని అవగాహన కల్గింది. n

## 1954 ఫిబ్రవరి 20 బాబా ద్వితీయ పర్యటన

1954 ఫిబ్రవరి 20 శనివారం రాత్రి 8.20 ప్రాంతంలో మెహెర్‌బాబా, ఆయన మండలి బృదం రెండవ దఫా ఆంధ్రా పర్యటనకై విజయవాడ చేరారు.

ఈ పర్యటనలో మెహెర్‌బాబా కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాలను సందర్శించారు.

ఆ పిమ్మట బాబా తన పర్యటన ముగించుకుని **మార్చి 6న** పూనేకు చేరుకున్నారు.

బాబావారి ఈ పర్యటనలో వేలాదిమంది ప్రజానీకం అవతారుని దర్శన, పాదస్పర్శ భాగ్యం పొందారు. ఆ మాదిరిగా బాబా తాను ఎంపిక చేసుకున్నవారి హృదయాలను నేరుగా తాకారు. 1953 నవంబరు 15న తొలిసారిగా తెలుగునాట బాబావారి అనుమతితో కొవ్వూరులో బాబా కేంద్రం ప్రారంభించారు.

ఈ సందర్భంగా బాబా తన సందేశాన్ని ఇలా పంపారు.

**Be true to your duty.**
**I want you to make Me your constant companion.**
**Think of Me more than you think of your own self.**
**The more you think of Me, the more you will realise**
**My love for you.**

**Your duty is to keep Me constantly with you throught your thought, speech, and action.**

**1958 జూలై 9న** మెహెరాజాద్‌లో బాబాతో ఆంధ్రా ప్రేమికుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఆ రోజుననే కొవ్వూరులో మెహెర్‌స్థాన్ నిర్మాణానికి బాబా తన అనుమతి ఇచ్చారు. అనంతరం శంఖుస్థాపన విషయమై 1960 ఫిబ్రవరి 25గా ఖరారు చేశారు.

ఆ రోజున మహా శివరాత్రి పర్వదినమైంది.

అలాగే, అవతారుని జన్మదినం కూడా కావడం విశేషం.

**మెహెర్‌స్థాన్ శంఖుస్థాపన మహోత్సవ సమయంలో**
**శ్రీ కోడూరికి పంపిన బాబా ఒక సందేశంలో ఇలా అన్నారు. ...**

**I WAS WITH YOU WHEN YOU LAID THE FOUNDATION STONE OF YOUR TEMPLE OF LOVE**

**- BABA**

# 'మెహెర్‌స్థాన్' ప్రారంభోత్సవ సమయాన శ్రీమతి శాంతాదేవి మహారాణీ సందేశం



**ఓ ప్రియతమ ప్రభూ! మెహెర్ బాబా!**

ఈనాడు ఈ కొవ్వూరు పట్టణంలో నీ గృహమైన ''మెహెర్‌స్థాన్''ను ప్రారంభించవల్సిందిగా నన్ను ఆజ్ఞాపించావు. నీ కృపా విశేషముచే ఈ నిర్మాణం జరిగింది. నీ యొక్క ప్రేమ చిహ్నంగా మాకు ప్రసాదించిన ఈ నిర్మాణంలో శ్రీ కోడూరి కృష్ణారావు దంపతులు ధన్యులైరి.

నీ యదార్థమైన నివాసము మా హృదయాలలో వుంది. నీ కృపా విశేషముచే మేము మా హృదయమందిరము యొక్క ద్వారములను తెరచి, నీ యదార్థ స్వరూపమును దర్శింపగలుగునంత వరకునూ, నీ ప్రేమైకమూర్తిని కాంశ్య విగ్రహమునందు మూర్తీభవింపజేసి అందు నీ రూపమును మేము గాంచుటకును, ఆరాధించుటకును, ముందు తరములవారికి ఈ దృశ్యము కన్నులపండువ గావించునట్లును చేయునట్టి నీ తేజోమయ మూర్తి సంస్థాపితము గావింపబడిన ఈ 'మెహెర్‌స్థాన్' మందిరము యొక్క ద్వారములను తెరచుటతో సంతృప్తిని పొందితిమి. మెహెరస్థాన్‌కు విచ్చేయు ప్రతియొక్కరునూ, నీ ప్రేమపూర్వకమైన ఆశీస్సును పొందుదురు గాక!

## బాబా కాంశ్య విగ్రహావిష్కరణ శుభసమయమున శ్రీమతి శాంతాదేవి మహారాణి ప్రసంగం

**ఓ సనాతన పురుషా! యుగావతారా! ప్రియతమ మెహెర్ బాబా!**

కొవ్వూరునందు 'మెహెర్‌స్థాన్'లో గల మీ విగ్రహమును ఆవిష్కరింప వలసినదిగా నన్నాజ్ఞాపించియున్నారు. ఇందుకు ముందుగా వినయ వినమితమగు పరిపూర్ణ హృదయముతో మీకొక ప్రార్థన చేసుకొనుచున్నాను. మీ విగ్రహమును మేము ఇప్పుడు ఆవిష్కరించుతున్న సులభముగా మిమ్ములను మా హృదయములలో ఆవిష్కరింపచేయునట్లు నీ ప్రేమను మేము పెంపొందించుకొనునట్లు మమ్ములన్ని ఆశీర్వదించండి!!

"మెహెర్‌స్థాన్" – ధనికులకు, దరిద్రులకు, కుల, మత, జాతి వివక్షతలు లేకుండగా ఎల్లరకును స్వాగతం పలుకుతుంది. "మెహెర్‌స్థాన్" నకు విచ్చేసే యావన్మంది యాత్రీకులు, యావత్తు ప్రజానీకం అవతార పురుషుని ప్రేమను, కరుణ అనుభూతి పూర్వకంగా పొంది, వారి హృదయాలలో సత్య ప్రేమ సందేశములతో నిండినవారై వారివారి నెలవులకు చేరుకొందురుగాక!

## 1963 ఫిబ్రవరి, 3 – ఆదివారం



మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొంటున్న ఆదీ.కె.ఇరానీ, బరోడా మహారాణి, శాంతాదేవి మెహెరాబాద్‌లో వున్న బాబా దగ్గరకు వచ్చారు. మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ సమయంలో చేపట్టాల్సిన కొన్ని విషయాలను బాబావారికి సూచించారు. నీ ఆరోగ్యం జాగ్రత్త! అని బరోడా మహారాణితో బాబా అన్నారు. బరోడా మహారాణి, మాట్లాడుతూ – తాను మెహెర్‌ధామ్, హమీర్‌పూర్ ప్రారంభోత్సవానికి వెళ్ళినప్పుడు స్థానిక ప్రేమికులు ఇచ్చిన గౌరవ మర్యాదలు, వారు కురిపించిన ప్రేమ తానెన్నడూ తన సొంత రాజ్యంలో కూడా ఎన్నడూ చవిచూడలేదని చెప్పారు.

బాబా! నీ ప్రేమికుల ప్రేమ, విధేయత వర్ణింప వీలుకాదన్నారామె.

సాయంత్రం 4 వరకు బరోడా మహారాణి మెహెరాజాద్‌లో స్త్రీ మండలితో వుండి ఆ పిదప పూనేకు తిరిగి ప్రయాణమయ్యారు.

# 1963 ఫిబ్రవరి, 25, సోమవారం

ఆ రోజు ప్రియతముని 69వ జన్మదినోత్సవం!!

కానీ, బాబా తన పుట్టినరోజునాడు ఎలాంటి వేడుకలు జరపొద్దని ఆదేశించారు.

మరో 3 రోజుల్లో అంటే ఫిబ్రవరి 28న మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ సంబరాల వల్లనో! ఏమో! బాబా జన్మదిన వేడుకలు వద్దన్నారు.

అనాడు బాబా ఎలాంటి ప్రత్యేక సందేశం ఇవ్వలేదు.

ఐతే, బాబాకు గ్రీటింగ్స్ చెబుతూ, తన ప్రేమికులు ఒక పోస్ట్ కార్డుపై ఉత్తరం కానీ, టెలిగ్రాంలు పంపవచ్చని చెప్పారు. దాంతో ఆనాడు అహ్మద్‌నగర్ పోస్టాఫీసు అవతారునికి శుభాకాంక్షలతో అనేక టెలిగ్రాంలతో నిండిపోయింది. టెలిగ్రాఫిక్ ప్రింటర్లు రాత్రి – పగలనకా **టిక్ టిక్ శబ్దం** చేస్తూనే వున్నాయి.

# 1954 ఫిబ్రవరి, 26

1954 ఫిబ్రవరి, 26న గోపాలపురం, నిడదవోలులో ప్రజాదర్శన కార్యక్రమాలు ముగిశాక బాబా కొవ్వూరుకు రాత్రి 8 గంటలకు వచ్చారు. ఆరోజు రాత్రి భోజనాలయ్యాక 9 గంటల ప్రాంతంలో గోదావరి నదీ తీరంలో ఇసుక తిన్నెలపై బాబా ప్రజాదర్శనం ఇచ్చారు. ఈ దర్శన కార్యక్రమ ఏర్పాట్లు శ్రీ కోడూరి కృష్ణారావు చేశారు. సుమారు 5 వేల మంది స్థానికులు అవతారుని దివ్యదర్శనం పొందారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. చిన్నపిల్లలు కూడా బాణాసంచా చూడ్డానికి వెళ్ళకుండా అవతారుడిని చూస్తూ కన్నార్పకుండా వుండిపోయారు.

రాత్రి 10 గంటలకు బాబావారికి ఆరతి ఇచ్చారు. ఆ రోజు రాత్రి బాబావారికి ఆయనతో పాటు వచ్చిన మండలి వారందరికీ గోదావరి నది నడుమ లాంచీలలో శ్రీ కోడూరి ప్రత్యేకమైన బస ఏర్పాటు చేశారు. బాబా కోసం ప్రత్యేకంగా ఒక లాంచీని ఏర్పాటుచేశారు. ఆ ప్రశాంత వాతావరణంలో బాబా – మండలివారందరూ సేద తీరారు.

ఆ మర్నాడు ఫిబ్రవరి 27న ఉదయం ఫలహారం ఏర్పాట్లు కూడా లాంచీలలోనే చేశారు. ఆ దరిమిలా వేలాది మందికి బాబా ప్రజాదర్శనం ఇచ్చారు. ఎందరికో తన ప్రసాదం ఇచ్చారు. ఆ కార్యక్రమం 11 గంటలకు పూర్తయ్యాక బాబా శ్రీ కోడూరి వారింటికి వెళ్ళారు. బాబా రాక సందర్భంగా అంతక్రితం వారం రోజులు ముందు నుండీ శ్రీ కోడూరి వేలాది మంది పేదలకు అన్నదానం చేశారు.

సుమారు 15 వేల మంది అన్నదానం తీసుకున్నారని అంచనా!!

బాబా కొవ్వూరు నుంచి రాజమండ్రికి మ. 1.50 కి బయల్దేరారు.

# మెహెరుని మధుర వాక్కులు

**"Except the Lord build the house, they labour in vain that build it."**

(127th Psalm).

**(ఎస్.వి.వి. సత్యన్నారాయణ, మల్లాది రామారావు)**

మెహెర్‌స్థాన్ నిర్మాణ విషయంలో ఈ మాటలు అక్షర సత్యాలు. మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ సమయంలో మెహెర్‌బాబా ఎనిమిది సందేశాలను అందరికీ కనపడేలా పెద్ద అక్షరాలతో రాయించమని శ్రీ కోడూరిని ఆదేశించారు. ఆయన ఆ ప్రకారం ఆ ఎనిమిది సందేశాలను మెహెర్‌స్థాన్ గోడలపై స్పష్టంగా రాయించారు. బాబా ఇచ్చిన ఈ సందేశాలూ నేటికీ మనం మెహెరస్థాన్ గోడలపై చూడొచ్చు.

1. Tear the curtain of set ceremonies and rituals and you will find that I am the Worshipped, the Worship and the Worshipper.

1. సాంప్రదాయముగా ఆచరింపబడుచున్న కర్మాకాండలు, పూజా విధానాలు, అను తెరను ఛేదించినచో, పూజింపబడువాడు, పూజ, పూజించువాడు నేనేనని గ్రహింపగలవు.

2. To clothe simple worship with the garments of ceremony and ritual is to expose Me to the cold winds of ignorance.

2. నిరాడంబరమైన ఆరాధనకు కర్మకాండలు, పూజా విధానములు అను వస్త్రములును కట్టబెట్టినచో నన్ను అజ్ఞానమను చలి గాలికి గురిచేయుటయే యగును.

3. To faithfully love God-Man is to truly worship God.

3. దైవీ మానవుని మనస్సుపెట్టి పూజిస్తే, భగవంతుడిని మనసా వాచా పూజించినట్లే.

4. To find Me here in Mehersthan search the depth of your heart.

4. ఈ "మెహెర్‌స్థాన్"లో నన్ను గాంచవలెనన్నచో నీ హృదయాంతరాళములో వెదకుము.

5. Mehersthan has been built for Me with love, but I may only be found here by My lover who brings Me here in his heart.

5. "మెహెర్‌స్థాన్" నా కొరకు ప్రేమతో నిర్మింపబడినది. కాని, నన్ను తన హృదయమున నిలుపుకొని ఇచ్చటకు తోడ్కొనివచ్చు నా ప్రేమికుడు మాత్రమే నన్నిచట గాంచగలుగును.

6. As the heart is, so is the house; as the eye is, so is the Image within the house.

6. నీ హృదయమెట్లుండునో, ఈ నిలయమట్లుండడును. నీ దృష్టి ఎట్లుండునో ఈ నిలయమందలి విగ్రహమట్లుండును.

7. The heart of man has always been the ancient temple for the worship of the Ancient One.

7. ఆ సనాతన పురుషుని పూజించుకొనుటకు మానవునకు తన హృదయమే సనాతన పూజామందిరమై యున్నది.

8. Nothing can house the Ancient One that does not house love.

8. ప్రేమకు నెలవుగాని తావు సనాతన పురుషునకు నెలవు కాజాలదు

బాబా నుండి ఈ సందేశాలు అందుకుని చదివి ఆవకళింపు చేసుకున్న స్థానికులు చర్చోపచర్చలు చేశారు. పలువురు పలురకాల అభిప్రాయాలు వెలిబుచ్చారు. పెద్ద ఎత్తున వాదనలే జరిగాయి. క్రొత్తగా నిర్మించిన మెహెరస్థాన్‌లో కర్మకాండలు నిర్వహించవలెనా? లేదా ? అనేది ప్రధానాశం.

పూజా విధానం ఎలా వుండాలి? మెహెర్‌స్థాన్‌లో బాబావారి కాంశ్య విగ్రహాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించాలా? లేదా? అన్నది మరో ప్రధాన మీమాంశ వారి ఎదుట నిల్చింది. ఈ ప్రశ్నలు వేటికీ స్థానిక బాబా ప్రేమికుల నడుమ ఏకాభిప్రాయం లేదు.

దాంతో స్థానిక బాబా ప్రేమికుడు, వకీలు, శ్రీ పాలకోడేటి రామలింగేశ్వరరావు బాబావారినే నేరుగా అడిగి తెలుసుకుందామని, బాబా శిష్యుడు మరియు కార్యదర్శి ఆదీ కె ఇరానీకి సవివరంగా వారి అనుమానాలు వివరిస్తూ 1963 జనవరి 19న ఓ సుదీర్ఘ లేఖ రాశాడు. ఆ లేఖను అందుకున్న ఆదీజీ రామలింగేశ్వరరావు గారి లేఖను బాబా ఎదుట చదివి అందుకు తగిన జవాబు వారికి రాయమని సూచిస్తూ మెహెరాజాద్‌లో వున్న బాబా మండలి సభ్యుడు ఏరుచ్ జెస్సావాలాకు పంపాడు.

కాగా, బాబా మండలి సభ్యుడైన ఏరుచ్ బాబావారి సూచనలు మేరకు వకీలు గారి ప్రతి ప్రశ్నకు చాలా వివరంగా జవాబిచ్చారు.

వకీలు రామలింగేశ్వరరావు గారు ఆదీజీకి రాసిన లేఖ, ఇందుకు జవాబుగా ఏరుచ్ పంపిన సమాధాన సారాంశాన్ని పాఠకులు పరిశీలించగలరు.

మెహెరస్థాన్ నిర్మించి 50 సంవత్సరాలు నిండి స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నా నాటి స్థానిక కొవ్వూరు బాబా ప్రేమికులకొచ్చిన అనుమానాలు, ఏరుచ్ ఇచ్చిన సమాధానాలు నేటికీ పలువురికి ప్రామాణికంగా నిలుస్తాయి. రాబోయే తరాలకూ స్ఫూర్తిగా, మార్గదర్శకంగా నిలుస్తాయి.

అలనాటి ఉత్తరాలని యధాతథంగా అనువదించకుండా వీలయినచోట అనుసృజన చేశాము. ఇంకొన్ని చోట్ల సందర్భానుసారం సంక్షిప్తంగా వివరించడమైంది.
ఇకపై చదవండి. మీకే తెలుస్తుంది.

**ముందుగా పాలకోడేటివారి లేఖ 1963వ సంవత్సరం జనవరి 19వ తేదీన ఆదీ కె ఇరానీకి ఇలా వ్రాశారు.**

మెహెర్‌స్థాన్ గోడలపై వ్రాయండి అంటూ బాబావారు పంపిన ఎనిమిది సందేశాలు ఈ లేఖకి ప్రేరణ, స్ఫూర్తి.

**పూజలు, కర్మకాండల తెర చించేయండి. పూజ, పూజారి, పూజా గ్రహీత అన్నీ నేనేనని తెలుస్తుంది మీకే – ఇదీ బాబావారిచ్చిన మొదటి సందేశం.**

కొవ్వూరులో సమావేశమయిన ఆంధ్రా మెహెర్ సెంటరు పెద్దలు ఆ సందేశం ఒకటికి రెండు సార్లు చదివారు. బాబావారి మాటకి భాష్యం చెప్పారు. ఇక్కడ మెహెరస్థాన్‌కి దగ్గరగా వుండే మాకే అవతారుని ఆంతర్యం అర్థం కాకపోతే దూరంగా వుండేవారికి ఏమర్థమవుతుంది. అందుకే మా మనస్సులో మాటను బాబావారి ముందుంచమని కోరుతూ ఈ లేఖ రాస్తున్నానన్నారు.

ఆ మాటల్లో భక్తుడి ఆవేదన వినిపిస్తుంది.

వేదాలని సృష్టించింది అవతారుడు.

అవతారుడు అంటే బాబా. అందువల్ల వేదాలు ఎప్పటికీ శిరోధార్యమే కదా?

మరో వాదన – వేదాల నుండి పుట్టింది మతం.

ఆ మతపు లేబ్రాయపు స్థితి – కర్మకాండలు.

ఈనాటి ప్రపంచానికి ఆ కర్మకాండలు ఎంతో అవసరం.

అసలు, ఇప్పుడు మనం ఈ కాలానికి తగ్గట్టు కొత్త కొత్త కర్మకాండలకి రూపకల్పన చేయాలి.

**కర్మకాండల్ని పూర్తిగా వదిలేయమని బాబావారు అన్నారనుకోను.**

కొత్త కర్మకాండలు కావాలి.

అవి ఎలా వస్తాయి.

పాత వాటిల్లోనుంచే కొంత మార్పులు చేర్పులతో వస్తాయి.

ప్రతి కర్మకాండలో అద్భుతమైన శక్తి దాగుంది.

దాన్ని వెలికితీయాలి.

ఇది నా అభిప్రాయం. తప్పంటారా! నా అభిప్రాయం తప్పో? కాదో ? బాబావారినే చెప్పమనండి.

బాబావారి మాట నాకు కనువిప్పు కల్గిస్తుంది.

నాకే కాదు అందరికీ మార్గదర్శనమవుతుంది.

హిందూ మతం గొప్పది, హిందూ జాతి గొప్పది. హిందూ మత నాశనానికి పూనుకొన్న బౌద్ధులకి దేశంలో స్థానం లేకుండాపోయింది.

వేదాల స్ఫూర్తినీ, సూక్తినీ వ్యతిరేకించిన తెగలు, మతాలు లేకపోలేదు.

అవి ఎక్కడున్నాయి ఇప్పుడు.

కాల గర్భంలో కల్సిపోయాయి.

రామానుజుడు, మధ్వాచార్యుడు, చైతన్య మహాప్రభువు ఎవరి వినాశనాన్నీ కోరలేదు సరికదా అందరి మంచినీ ఆశించారు. నలుగురి కోసం జీవించారు. వేదాల్లో చెప్పిన ఉన్నతాశయాల సాధనకే హిందూ జాతి అంకితమైంది.

కర్మకాండలకి స్వస్తి చెప్పాలన్నదే బాబావారి ఇచ్ఛ అని చాలామంది బాబా ప్రేమికులు అంటున్నారు.

వాళ్ళ అభిప్రాయాలతో నేను ఏకీభవించలేను.

కర్మకాండలకి స్వస్తి చెప్పాలన్నది బాబావారి వాంఛ అనుకోను.

అవతారుని ఉద్దేశమనీ నేను అనుకోను.

ఇలా నిర్మొహమాటంగా శ్రీ పాలకోడేటి చెప్పడంలో ఓ పరమార్థం వుంది.

అదేమంటే బాబావారి కాంస్య విగ్రహ ప్రతిష్ట వేద మంత్రాల ఉచ్ఛారణల మధ్య చేయాలన్నది ఆయన కోరిక.

కర్మకాండలకి స్వస్తి చెప్పడమంటే,

బాబావారి విగ్రహాన్ని వేద విధిలో ఆవిష్కరించడం కుదరదు కదా!

మరి వేదోచ్ఛారణ విగ్రహ ప్రతిష్టకి అనవసరమా!

ఇది బాబావారి అదేశమా!

వేదాలు అవతారుని సృష్టి.

అంటే మెహెరావతారుని సృష్టి.

ఈ వేదాల్లోనే కదా మనం మతం గురించి నేర్చుకొనేది.

వేదాలు సర్వ కాలాలకీ ప్రామాణికం. శిరోధార్యం.

ఎందుకని? అవి భగవంతుని సృష్టి కాబట్టి? అని అంటూ,

ఇహ భగవద్గీత గురించి కూడా ఆయన తన లేఖలో ప్రస్తావించారు.

కృష్ణుడిగా అవతరించినప్పుడు బాబావారు ప్రసాదించారు భగవద్గీత.

ధ్యానం, కర్మ, భక్తి మార్గాలని బోధించారు.

జ్ఞానం అందరికీ ఒకేలా వుండదు.

బ్రతుకుపోరాటంలో మునిగితేలుతున్న సాధారణ వ్యక్తి,

భక్తుడు, అవతారుడు – ఈ ముగ్గురూ మూడు కోవలకి చెందినవారు. అలానే భక్తులందరూ ఒకే స్థాయిలో వుండరని గీత ఘోషిస్తోంది. భగవత్ప్రేమకి అర్హులం కావాలంటే, ముందుగా పుణ్యపురుషుల సాంగత్యం అవసరం. వారి శుశ్రూషలో భగవంతుడిపట్ల శ్రద్ధ, నిష్ఠ, భక్తి ఏర్పడతాయి. భక్తితో తాదాత్మ్యత వస్తుంది. ఆ భావమే మహాభావనకు దారి తీస్తుంది.

దైవీ ప్రేమని పుట్టిస్తుంది.

అవతారుని దయ వుంటే దైవీ ప్రేమకి ఇన్ని దశలు అక్కర్లేదు. చిటికెలో పెల్లుబుకుతుంది దైవీ ప్రేమ. కోటి మందిలో ఎవరికో దక్కుతుంది ఈ అదృష్టం. అందువల్లనే ఎన్నో భక్తి మార్గాలు, దశలు, స్థాయిలు ఏర్పడ్డాయి.

పుట్టుకతోనే అందరూ జనక మహారాజులా కాలేరు.

ఆ రాజర్షి కూడా ఎన్నో ఏళ్ళు తపస్సు చేశాడు.

బాబావారికి తెలియందా ఈ సంగతి.

కలకత్తా దగ్గర హుగ్లీ నది ఒడ్డున బస చేసిన రామకృష్ణ పరమహంస కూడా దైవీ ఉపాసన చేశారు. భగవత్ సాక్షాత్కారం లభించే వరకూ కర్మకాండలు, పూజలు పునస్కారాలు వదిలిపెట్టడం కష్టమనేవారాయన. ఐతే, ఇది అవతార కాలం. అవతారుడి దయతో తెర తొలిగించుకోవటం తేలిక కాదనను. మెహెర్‌స్థాన్‌ని బాబా ప్రేమతో కట్టాము. ఇక్కడ అడుగు పెట్టేవారికీ, బాబావారిని గాఢంగా ప్రేమించి ఆరాధించే వాళ్ళకీ తెరని చించిపారేసే శక్తి వస్తుంది. ఈ శక్తి కూడా ప్రియతముని వరమే. దేవ దేవునితో ఒకటయన భావన కల్గినవారికే తెరతొలుగుతుంది. ఈ భావన ఎందరి సొత్తు? అందరి సొత్తూ కాదు కదా!

ఆద్యంత రహితమయిన మతం ఋషుల మతం.

ఈ సనాతన మతం పూజకు ఒకే పద్ధతిని నిర్దేశించ లేదు.

అనేక పద్ధతులని ప్రధానం చేసింది. అలానే ఋషులు కూడా అనేక పూజా మార్గాలనీ పద్ధతులనీ సూచించారు. ఋషులు క్రతువులు, హోమాలు చేశారు. వాళ్ళ కోసం కాదు. నలుగురికీ ఆదర్శంగా వుండటం కోసం.

ఇదే మాట కదా కృష్ణావతార కాలంలో బాబావారన్నది.

ప్రపంచ సంక్షేమం కోసం, ఆదర్శం కోసం, నేను ఎన్నో పూజలు, కర్మకాండలు చేస్తాను. కానీ వాటికి నేను అతీతుడని అంటాడు కృష్ణుడు భగవద్గీతలో.

**'యద్యాది అచారాధి శ్రేష్ఠ!'** అని గీతాకారుడు అన్నాడు.

అంటే భగవంతుని స్మరణే ఉత్తమ కర్మ అని కదా గీతా సందేశం.

ఈ ప్రపంచంలో మనిషి ముక్కుకి సూటిగా పోలేడు.

ఇది బాబావారికి తెలుసు.

ఎక్కడ చూసినా పెదవిపై ఒకమాట, మనసులో మరోమాట అంతటా.

మోసం, నయవంచనా కన్పిస్తాయి. కాబట్టి సాధారణ వ్యక్తి భగవంతుని ప్రేమించాలనుకొన్నా అది అంత తేలిక కాదు. ఇహపోతే బాబావారు చెప్పినట్లుగా అవతారుడిని ప్రేమించి ఆరాధించడం ఆషామాషా పనికాదు కదా. కాబట్టి మమల్ని ఏమి చేయమంటావ్ దేవాది దేవా అని వేడుకొంటూనే...మమల్ని మా అలవాటు ప్రకారం విగ్రహ ప్రతిష్ట చేసుకోనీ బాబా అన్న అభ్యర్ధన వినిపించారు.

అదీ ఎలా చేశారో గమనించండి.

బాబావారు కర్మకాండలు తుడిచిపెట్టేయమన్నారని అన్నామనుకోండి.

నేటి కాలంలో కర్మకాండలకి స్వస్తి చెప్పడమే మంచిదని మా వాళ్ళు తడుముకోకుండా అంగీకరిస్తున్నారనుకోండి, అందరూ కాదు, కొంతమంది.

అయితే నిజంగా బాబావారి ఉద్దేశ్యం కర్మకాండలకి స్వస్తి కాదనుకోండి – అప్పుడేమవుతుంది. మేము ఇంకో పాపం చేసినట్లు కదా! అని పాలకోడేటి ప్రశ్నించారు.

ఈ మాటా ఆ మాటా చెప్తూ పెద్ద ఉత్తరమే వ్రాశాడాయన.

అయ్యో పెద్ద ఉత్తరం వ్రాసేనే అన్నారు. ఏదో ఆదుర్దాలో వ్రాశాను. నన్ను క్షమించు ఆదీ అన్నారు.

అవతారుడికి తెలియనిదేముంది. సర్వాంతర్యామి కదా బాబా అన్నారు.

నా చేత ఉత్తరం వ్రాయించిందీ బాబావారే.

కాబట్టి నా సుదీర్ఘమైన ఉత్తరానికి బాబావారే ప్రేమతో జవాబివ్వాలి.

నా కళ్ళు తెరిపించాలి అని వేడుకొన్నారు.

ఈ ఉత్తరం నా కోసం కాదు. మెహెర్‌స్థాన్ కోసం సుమా అన్నారు.

మెహెర్‌స్థాన్ కోసం వ్రాశాను కాబట్టి, నా గోడు బాబావారికి వినిపించండన్నారు.

ఈ ఆత్మఘోషని పరమాత్మకి వినిపించండి.

నా ధర్మ సందేహాలని తీర్చమనండి.

అవతారుడు మన మధ్య సశరీరులై ఉన్నారు కాబట్టి మనకి మార్గనిర్దేశం చేయాలని మనవి చేశారు.

**చివరిగా, ఏ విషయాలపై మార్గనిర్దేశం అవసరమో స్థూలంగా మళ్ళీ మరోమారు చెప్పారు.**

1. కర్మకాండల్ని పూర్తిగా వదులుకోవాలా!
2. శ్రీరాముడుగా అవతరించినప్పుడు బాబావారు రామేశ్వరంలో శివలింగ ప్రతిష్ఠ చేసినట్లు ఇప్పుడు బాబావారి విగ్రహావిష్కరణ మెహెర్‌స్థాన్‌లో వేదోక్తంగా జరగాలన్న నా అభిమతం బాబావారికి సమ్మతం కాదా!
3. విగ్రహ ప్రతిష్ఠకి పాటించాల్సిన విధి విధానాన్ని బాబావారు నిర్దేశించాలి. మెహెర్‌స్థాన్‌లో మేము ఎలా నడుచుకోవాలి? బాబావారి ఇచ్ఛ ఏమిటి?
4. విగ్రహ ప్రతిష్ఠ తర్వాత పూజలు ఎలా జరగాలి?

మెహెర్‌స్థాన్‌లో రోజువారి కార్యక్రమాల మాటేమిటి? మెహెర్‌స్థాన్ నిర్వహణ ఏ ప్రకారం చేయాలి.

ఇలా నాలుగు ప్రశ్నలతో పాలకోడేటివారు తమ లేఖను ముగించారు.

జనవరి 19న ఆదీ.కె.ఇరానీకి వ్రాసిన ఈ లేఖకి ఫిబ్రవరి 1న జవాబు వచ్చింది.

ఆదీ నుంచి కాదు సుమా. ఏరుచ్ మాహాశయుడి నుంచి.

ఏరుచ్ తన జవాబులో ముందుగా ఇలా అన్నారు.

ఏడాదిపాటు ఉత్తర ప్రత్యుత్తరాలను నిషేధించారు బాబా.

ప్రస్తుతం ఏకాంతవాసంలో వున్నారు.

అయినా మీ ఉత్తరం చదవనిచ్చారు.

మీరేమో బాబావారికే పి.ఎ. (అంతరంగిక కార్యదర్శి) కదా.

బాబా ప్రేమ చూరగొన్న మీ అంతటి వ్యక్తికి ఎదురేమి వుంటుంది అని పొగుడుతూనే చాలా సూటిగా పాలకోడేటివారి ప్రశ్నలకి సమాధానాలు చెప్పారు ఏరుచ్.

బాబావారి నుంచి సేకరించిన సంకేతాలను బట్టి మీ ప్రశ్నలకి జవాబు చెప్పే ప్రయత్నం చేస్తాను. డొంకతిరుగుడుగా వ్రాయను అన్నారు.

మీ సుదీర్ఘమైన లేఖకి ఒక్క మాటలో బదులు ఇవ్వవచ్చు.

**1962 నాటి జనవరి – ఫిబ్రవరి మెహెర్ పుకార్ పత్రిక 7వ పేజీ నుంచి 31వ పేజీ వరకు చదివితే** మీ సందేహ నివృత్తి అవుతుంది. ఐతే మీ ధర్మ సందేహాలకి మూలం – బాబావారు మెహెర్‌స్థాన్‌కి పంపిన ఒక సందేశంలా కనిపిస్తోంది. పూజలు, కర్మకాండల తెర చింపేస్తే పూజితుడు, పూజ, పూజారి నేనేనని గ్రహిస్తారు అని ఆ సందేశంలో బాబావారు ప్రస్ఫుటం చేశారు. ఈ సందేశమే మీ ప్రశ్నలకి మూలకారణం అనిపిస్తోంది కాబట్టి పరిస్తరంగా మీ నాలుగు ప్రశ్నలకి జవాబు వ్రాస్తున్నాను అంటూ తమ ఉత్తరం మొదలుపెట్టిన ఏరుచ్, పాలకోడేటివారి నాలుగు ప్రశ్నలకీ వరుసగా జవాబుచెప్పారు.

### ప్రశ్న 1. కర్మకాండలకు పూర్తిగా స్వస్తి చెప్పాలా?

**ఏరుచ్ జవాబు:** మెహెర్‌బాబా ఈనాటి యుగావతారుడు. తమ ప్రేమికులు భక్తితో తమని ఎలా పూజించాలో చెప్పారు. నిజమైన పూజ అంటే ఏమిటో కూడా వివరించారు. యజ్ఞం, హోమం వంటి క్రతువులతో పూజ ముడిపడకూడదన్నారు. ఏ నియమ నిష్ఠలతోనూ ప్రార్ధన చేయవద్దన్నారు. సంప్రదాయానుసారం అసలు ప్రార్ధన వద్దన్నారు. ఈ రకంగా ఎప్పుడూ తమని ప్రార్ధించవద్దని కూడా స్పష్టం చేశారు బాబా. తరతరాలుగా ఆచరించడం వల్ల తుప్పుపట్టిన కర్మకాండలకి తమ పూజా గృహంలో స్థానం కల్గించవద్దన్నారు.

బాబావారు ఇంకోమాట చెప్పారు. పూజా విధానాలు రానురాను గజిబిజిగా మారి ప్రేమికుని దిక్కుతోచనివాడిగా చేస్తాయి.

పూజకు గొంతు పెగలనివ్వవు.

అటువంటప్పుడు ప్రియతముడు వస్తాడు. ఎందుకో తెలుసా?

ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఆచార వ్యవహారాల వలయం నుంచి ప్రేమికుడిని బయటపడేయటానికి. ఈ యుగంలో అవతరించిందీ ఇందుకేనని బాబావారు తరుచు అంటారు అని కర్మకాండలు అవసరమా వాటికి స్వస్తి చెప్పాలా అన్న పాలకోడేటివారి

సుదీర్ఘ ప్రశ్నకి సుదీర్ఘంగానే జవాబునిచ్చారు ఏరుచ్.

నిజమైన ప్రేమపై బాబా ఉవాచని వివరించారు.

భగవంతుడి పట్ల ప్రేమ గుండెలోతుల్లో నుంచి పెల్లుబకాలి. అదే నిజమైన భగవత్ పూజ అని బాబావారు అంటారు. ఉప్పెనలా పొంగిపొర్లే ప్రేమ ఎలా వుంటుంది? రకరకాలుగా వ్యక్తమవుతుంది. కొందరు భగవంతుడికి పుష్పాభిషేకం చేయవచ్చు. ఇంకొందరు పుష్పమాలలు సమర్పించవచ్చు. మరికొందరు గొంతెత్తి పాటపాడవచ్చు. నామసంకీర్తన భజన చేయవచ్చు. ఎటువంటి ప్రేరణ లేకుండా, ఎటువంటి విధివిధానాలకీ కట్టుబడకుండా చేసే భగవతార్చన నిజమైన పూజ. ఆ పూజ భగవంతుడికి ఆమోదయోగ్యమైంది. అదే భగవంతుడిని చేరుతుంది అని బాబావారు విశదం చేస్తున్నారు.

ఫలానా ప్రకారం చేయాలి అనడం, సొంత బుద్ధి కొంచెంగా కూడా ఉపయోగించకుండా చెప్పినట్లు పూజ చేయమనడం – ఇప్పటి అలవాటు కాదు. తరతరాలుగా వస్తున్న అలవాటు. ఈ ప్రకారం చేసే పూజ యాంత్రికంగా జరుగుతుంది తప్ప మనస్సుపెట్టి చేసిన పూజ కాదు. మరి అటువంటి పూజ భగవంతుడిని చేరదు కదా, భక్తుడిని అజ్ఞానాంధకారంలోనే మ్రగ్గేలా చేస్తుంది. ఇదీ బాబావారి ఉవాచ మిత్రమా అని ఏరుచ్ పాలకోడేటివారి కర్మకాండల ధర్మసందేహాన్ని తీర్చారు.

**2) ఇహ రెండవ ప్రశ్నకి వస్తే, ఏరుచ్‌గారి జవాబుని ఈ తరమే కాదు తరతరాలవారు గుర్తుంచుకోవాలి. అంతటి విశిష్టమైనది.**

**పాలకోడేటివారి ప్రశ్న:** రామేశ్వరంలో రామలింగేశ్వర విగ్రహ ప్రతిష్ఠని శ్రీరాముడు శాస్త్రోక్తంగా చేశాడు కదా. అలాగే ఇప్పుడు మెహెర్‌స్థాన్‌లో ప్రియతమ మెహెర్‌ని విగ్రహ ప్రతిష్ఠ చేయాలన్నది నా సంకల్పం. బాబావారు నా అభిప్రాయంతో ఏకీభవిస్తారా?

**ఏరుచ్ గారి జవాబు:** ఈ ప్రశ్నకి సమాధానం చెప్పేముందు ఓ సంగతి గుర్తుచేయాలి మీకు. మీరు ఆవిష్కరిస్తున్నది ప్రియతమ బాబావారి కాంస్య విగ్రహాన్ని కాదు. కాంస్యంలో మూర్తీభవించిన ప్రియతముడిని ఆవిష్కరిస్తున్నారు మెహెర్‌స్థాన్‌లో. ఈ సంగతి మరచిపోకండి. విగ్రహావిష్కరణ తర్వాత ఏంచేయాలి? హిందువులు వేదమంత్రాలతో ప్రభుస్తుతి చేయవచ్చు. అలాగే, మహమ్మదీయులకి ఖొరాన్ పఠించే వీలు కల్గించాలి. క్రైస్తవులనీ, జొరాష్ట్రియన్‌లనీ కూడా సంకీర్తన చేసుకోనివ్వాలి. వాళ్ళ మత పద్ధతుల మేరకు వాళ్ళని ప్రభు గానం చేయనివ్వాలి.

అలానే హరిజనులకీ అవకాశం కల్గించాలి. మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ శుభవేళ సర్వోన్నతుని కీర్తిస్తూ వాళ్ళు భజన చేయాలి అని ఏరుచ్ బాబావారి మాటగా పాలకోడేటిగారికి చెప్పారు.

ఈ మాటల తాత్పర్యం పాఠకులకి అర్థమయివుండాలి.

అయినా ఏరుచ్ మాటలకి టీకా తాత్పర్యం అవసరమా?

రామలింగేశ్వర ప్రతిష్ఠ గురించి ప్రస్తావిస్తూ ఏరుచ్ కొంచెం నిర్మొహమాటంగా, మరి కొంచెం సూటిగా బాబా మాటని స్పష్టం చేశారు.

వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీరాముడు శివలింగ ప్రతిష్ఠ చేసి వుండవచ్చు.

కానీ శ్రీరాముడు అవతారుడు.

నేను చెప్పినట్లు చేయండి తప్ప నేను చేసినట్లు చేయకండి అని బాబావారు తరచు హెచ్చరిస్తుంటారు.

అవతారుడు ఏం చేసినా సరైన పనే.

ఎందుకంటే అవతారుడు భగవంతుడు కాబట్టి మంచి పనే చేస్తాడు ఎప్పుడూ.

అయినా, ఎప్పటికీ అవతారుడు చేసిన పని అప్పటి కాలమాన పరిస్థితులకి వర్తిస్తుంది తప్ప, సర్వకాల సర్వావస్థలకీ వర్తించదు.

ఇంకోమాట. ప్రతి అవతార కాలంలోనూ భగవంతుడు ఓ పని చేస్తాడు.

అదేమిటి? గత అవతారకాలంలో తాను చేసిన పనులకి, చేతలకి రకరకాల విపరీతార్థాలు ఆపాదించబడ్డాయి కాబట్టి, ఆ పాప పంకిలాన్ని పూర్తిగా శుభ్రంగా తుడిచేస్తాడు. అలా చేయటంవల్ల, గత అవతారకాలపు చర్యలకు ఈ అవతారకాలంలో ప్రాధాన్యత లేకుండా పోవచ్చు. అయినాసరే అవతారుడు భూమిపైకి దిగివచ్చిన ప్రతిసారీ చేసే పని ఇదే అని ఏరుచ్ రామావతారంలో విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది కాబట్టి మెహెరావతారంలో మెహెర్‌స్థాన్ విగ్రహావిష్కరణ హిందూ శాస్త్రోక్తంగానే జరగాలన్న పాలకోడేటివారి సంకల్పం బాబావారికి సమ్మతం కాదని చెప్పకనే చెప్పారు.

**3) ఇహ 3వ ప్రశ్న: విగ్రహ ప్రతిష్ఠ పద్ధతిని బాబావారు నిర్దేశించాలి.**

**ఈ ప్రశ్నలకి ఏరుచ్‌వారి స్పందన చదవండి.**

బాబావారి విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్నామనుకొంటున్నారు కాబట్టి మీరు ఈ ప్రశ్న వేస్తున్నారు.

బాబావారేమంటారో తెలుసు కదా .

**భగవంతుని నిజ విగ్రహం - సశరీరులైన అవతారమూర్తి ఒక్కటే.**

మరో విగ్రహం లేదు.

ఇంకో విగ్రహం కావాలంటే 700 సంవత్సరాలు ఎదురు చూడాల్సిందే.

కొత్త అవతారుడు అవతరించేది 700 ఏళ్ళ తర్వాతనే కదా!

ఇప్పుడు కాదు కదా.

ఇహ విగ్రహంలోకి బాబావారిని ప్రాణప్రతిష్ఠ పూజలతో ఆహ్వానించ లేరు.

మెహెర్‌స్థాన్‌లో నెలకొన్నది బాబా విగ్రహం అనుకొన్నారో బాబావారిపై మీకున్న గురి, నమ్మకం తుడిచిపెట్టుకుపోతుంది.

బాబావారి పట్ల మీ ప్రేమ మాయమవుతుంది.

బాబావారి ఆదేశాలని శిరోధార్యంగా నమ్మి పాటించే విధేయత ఎందుకూ కొరగాకుండా పోతుంది. కాంస్య విగ్రహంలో తప్ప మరెక్కడా బాబావారి ఉనికిని గుర్తించలేని వాళ్ళకి,

గ్రహించలేని వాళ్ళకి మాత్రమే మెహెర్‌స్థాన్‌లో బాబావారు కేవలం విగ్రహంగా దర్శనమిస్తారు. మెహెర్‌స్థాన్‌ని బాబా ప్రేమికులు తమ ప్రార్థనా మందిరంగా తీర్చిదిద్దుకోవాలి.

స్వచ్ఛమైన ప్రేమతో మెహెర్‌స్థాన్‌లో బాబావారిని ఆరాధించాలి. పూజించాలి.

మెహెర్‌స్థాన్‌లో కొలువున్న బాబావారి విగ్రహాన్ని వేద మంత్రాల మధ్య ప్రతిష్ఠించాలన్న ఆలోచనలను దగ్గరకిరానీకండి. ఆ ఆలోచనలని మనస్సునుంచి తరిమేయండి.

మెహెర్‌స్థాన్‌ని అసలు సిసలైన పూజా మందిరంగా మార్చాలి.

మెహెర్‌స్థాన్‌లో బాబావారి విగ్రహం కానీ, బొమ్మ కానీ వుందనుకోకూడదు.

ఇక్కడ ప్రియతమ మెహెర్‌బాబా నెలకొన్నాడని మనసావాచా గుర్తించాలి.

కాబట్టి మీ మూడో ప్రశ్నకి ఒక్క మాటలో సమాధానం మెహెర్‌స్థాన్‌లో ప్రియతమ బాబావారు కొలువైవున్నారని నమ్మండి. మెహెర్‌స్థాన్‌లో ఎల్ల కాలాలకీ, తరతరాలకీ బాబావారి దర్శన భాగ్యం కల్గించడానికి కాంస్య విగ్రహం దోహదం చేస్తుంది అని ఏరుచ్‌గారు అభయం పట్టారు.

**4) ఇహ నాల్గవ ప్రశ్న: విగ్రహవిష్కరణ తర్వాత రోజూ ఏ ఏ పూజలు చేయాలి?. పూజలు ఏ ప్రకారంగా చేయాలి?.**

**ఏరుచ్‌గారి జవాబు:** బాబావారిక్కడ ఉపతిష్ఠులై వున్నారన్న భావనతో బాబా ప్రేమికులు మెహెర్‌స్థాన్‌లో అడుగుపెడితే, నిత్య పూజల సమస్య ఎదురవ్వదు. అహమ్మద్‌నగర్, పూనేలో బాబావారి సమక్షంలో మీరు ఎలా వుంటారో అలానే మెహెర్‌స్థాన్‌లో కూడా నడుచుకోవాలి.

ఎందుకనా, ఎందుకంటే ... మెహెర్‌స్థాన్‌లో కూడా బాబావారున్నారు కదా.

ఇహ పూజారి, పూజా విధానాలకి వస్తే, మెహెర్‌స్థాన్‌లో అడుగుపెట్టే ప్రతి బాబా ప్రేమికుడూ బాబావారి పూజారే, నిస్సందేహంగా మెహెరస్థాన్ తలుపులు అందరికీ తెరిచివుంచాలి.

కులం, మతం, జాతి వివక్షత వుండకూడదు.

ఎవరికి వీలైన విధంగా, ఎవరికి తోచిన విధంగా బాబా ప్రేమని వ్యక్తం చేసే స్వేచ్ఛ బాబా ప్రేమికులందరి సొత్తు.

ఇహ పూజ విషయానికి వస్తే, మెహెర్‌స్థాన్‌లో బాబా నామస్మరణే గొప్ప పూజ.

బాబావారిని ప్రస్తుతిస్తూ మనస్సు విప్పి పాడటమే సర్వోత్తమమైన పూజ.

పాడటం రాకపోతే ఏం – బాబావారి ప్రవచనాలు సందేశాలు చదువుకోవచ్చు.

గుర్తు చేసుకోవచ్చు. బాబా సందేశాన్ని పదే పదే నెమరు వేసుకోవచ్చు.

ప్రభుస్తుతి – పర్వర్దిగార్ ప్రార్ధన చేయవచ్చు. పశ్చాత్తాప ప్రార్ధన చేయవచ్చు.

బాబా సందేశం – సర్వోన్నతుడు గట్టిగా పైకి నలుగురికీ వినిపించేలా చదవవచ్చు.

మనవాళ్ళకి మెహెరుని పిలుపు సందేశం కూడా పైకి నలుగురికీ వినపడేలా చదవనూవచ్చు.

బాబా భజనలు, పాటలు వినవచ్చు.

ఇదీ అదీ కాదంటే హాయిగా బాబావారి ముందు కూర్చుని, బాబావారి సహవాస కార్యక్రమ విశేషాల గురించి మాట్లాడుకోవచ్చు. ఇటీవల జరిగిన ప్రాక్ – పశ్చిమ సమ్మేళనం గురించీ ముచ్చటించుకోవచ్చు.

ఒక్కమాటలో చెప్పాలంటే, మెహెర్‌స్థాన్‌లో పూజలపై ఆంక్షలు వుండకూడదు.

గొప్ప, చిన్న, ధనికుడు – పేద అన్న తారతమ్యం చెల్లదు.

ఎవరికి తోచిన రీతిలో వారు హాయిగా, మనస్ఫూర్తిగా తమ ప్రేమని, భక్తినీ ప్రభువుకి సమర్పించుకోగలగాలి.

మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ శుభవేళకి బాబావారు పంపిన ఎనిమిది సందేశాలు కూడా పూజా విధానమేననవచ్చు. పాతకాలపు విధివిధానాలు అనండి,

సంప్రదాయపు పద్ధతులనండి,

అవి ఏవైనాసరే మెహెర్‌స్థాన్‌లో పాటించకూడదు.

ఐతే క్రమశిక్షణ నిక్కచ్చిగా పాటించాలి.

మెహెర్‌స్థాన్ లోపల, బయట శుభ్రంగా, పరిశుభ్రంగా వుంచాలి.

ఈ మేరకి నియమావళిని రూపొందించి నలుగురికీ చెప్పండి.

నోటీసు బోర్డులో పెట్టండి.

మెహెర్‌స్థాన్‌కి కాపలా మనిషిని వుంచాలి తప్ప పూజారులు వుండకూడదు.

నెలసరి వేతనానికి పూజారిని నియమంచే ప్రసక్తి లేనేలేదు.

ఎందుకంటే బాబా ప్రేమికుడు – ప్రతి ఒక్కరూ బాబావారి పూజారులే అని ఏరుచ్ మహాశయుడు పాలకోడేటివారి నాల్గవ ప్రశ్నకి జవాబు చెప్తున్నట్లు చెప్తూనే, ఈ యుగావతారుడికి పూజలు, పునస్కారాలు, క్రతువులు, కర్మకాండల అవసరం లేదని స్పష్టం చేశారు.

బాబా కోరేదీ, కావాల్సిందీ మీ ప్రేమ తప్ప మరేమీ కాదు అని విశదం చేశారు.

పాలకోడేటివారి లేఖ సుదీర్ఘమైనదయితే, ఏరుచ్‌వారి జవాబు దీర్ఘమయినదనాలి.

ఆ మాటే వ్రాశారు ఏరుచ్. "ఈ ఉత్తరం చాలా పెద్దదయింది. ఐతే, మీ ప్రశ్నలన్నింటికీ ఇచ్చిన జవాబుతో మీకు సంతృప్తి కలుగుతుందని ఆశిస్తాను" అన్నారు.

అనంత జ్ఞాని, కృపానిధి అయిన మెహెరుడికి తమ సందేహాలు తీర్చమంటూ బాబా ప్రేమికులు ఉత్తరాలు వ్రాశారు అడపాదడపా గతంలో.

అప్పుడు బాబావారి స్పందన, ఇప్పుడు మీరు లేవనెత్తిన విషయాలపై బాబావారు సూచనప్రాయంగా చెప్పిన సంగతులు ఆధారంగా వ్రాశానీ జవాబు. బాబావారి స్పందన, సంకేతాలకి కట్టుబడి వుంటూ, వాటి పరిధి దాటకుండా మీ ప్రశ్నలకి జవాబు వ్రాయడానికి యథాశక్తి ప్రయత్నించాను అని కూడా ఏరుచ్ మహాశయుడు వినమ్రంగా పేర్కొన్నాడు.

ఇంగ్లీషులో వచ్చిన బాబా సాహిత్యం, హిందీలో మెహెర్ పుకార్, ప్రేమ మహిమ, దైవీలీల చదివితే మీ సందేహాలకి సమాధానాలు మీకే దొరికేవి మిత్రమా అంటూ చురక కాని చురకవేశారు.

ఇప్పుడు ఈ ఉత్తరం మీకు అందింది కాబట్టి, ఈ సంగతులని నలుగురికీ మీరు చెప్పాలన్న బాబావారి కోర్కె కొవ్వూరులో వున్న బాబా ప్రేమికులందరికీ ఈ సంగతులు చెప్పండి.

ఆంధ్ర బాబా ప్రేమికలోకానికి కూడా ఈ వివరాలని తెలియజేయండి. అలాగే ఈ ఉత్తరంలో వ్రాసిన సంగతుల్ని తూచ తప్పకుండా ముందుగా, కోడూరి కృష్ణారావుగారికీ, ఆయన ధర్మపత్నికీ మీరు వివరించాలి.

ఇది బాబావారి కోర్కె అని ఏరుచ్ తమ లేఖని ముగించారు.

పాలకోడేటివారికీ, ఆయన కుటుంబ సభ్యులకీ బాబావారి ప్రేమాశీస్సులు అన్నారు..

తమ లేఖ ముట్టినట్లు తెలియజేయమన్నారు.

పూజలు, కర్మకాండల తెర చింపేయడమే మెహెర్‌బాబా దివ్యలీల అని నౌరంగా (హమీర్‌పూర్)లో మెహెర్‌ధామ్, కొవ్వూరులో మెహెర్‌స్థాన్, బాబావారి లీలకి మాధ్యమాలయ్యాయి అని భావూ కల్చురీ విరచిత "లార్డ్ మెహెర్" లో పేర్కొన్నారు.

పిడివాదులకీ సిద్ధాంతాలకీ అతీతంగా వుంటూనే భగవంతునికి ప్రేమాభిషేకం ఎలా చేయవచ్చో బాబావారు చూపించారు.

పరమాత్ముడుని మనసావాచా పూజించి తరించే మార్గాన్ని మానవాళికి ప్రదానం చేశారు.

ఏరుచ్ ఉత్తరం ద్వారా ఈ సంగతి పాలకోడేటివారికి విదితమయింది. అందుకనే బాబా ఇచ్చ ప్రకారం నడుచుకొన్నారు.

మెహెర్‌ధామ్, మెహెర్‌స్థాన్‌లు వెలిసిన తర్వాత, ప్రజలకి పూజ అంటే తెలిసివచ్చింది. అందుకనే సనాతన సంప్రదాయాలకీ, పూజా విధానాలకీ నియమ నిబంధనలకీ ప్రజలు స్వస్తి చెప్పారు క్రమక్రమంగా.

ఈ పూజలు కర్మకాండలు ఎంత దండగో తెలిసివచ్చింది. దీనితో ఆధ్యాత్మిక మార్గపు నిజానిజాలు అవగతమయినాయి అని లార్డ్ మెహెర్‌లో తెలియజేశారు.

# మెహెరాజాద్ - 1963 జనవరి 27

జనవరి 27వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకి వారందరూ మెహెరాజాద్ చేరారు. బాబా సన్నిధికి వెళ్ళారు. అప్పుడు, ఏరుచ్ రామలింగేశ్వరరావ్‌గారి ధర్మ సందేహాలు చదివి వినిపిస్తున్నారు. ఈ ఉత్తరానికి ఏరుచ్ సిద్ధం చేసిన జవాబుని కూడా బాబావారు చదవమన్నారు.

అప్పుడు చెప్పారు మరిచిపోలేని, మరచిపోరాని ఓ సంగతి.

వైదీక పద్ధతులకీ, పూజలు, కర్మకాండకి తాము అతీతులమని స్పష్టం చేశారు. నా ప్రేమికులు మెహెర్‌స్థాన్‌లో భజన చేయాలి. సంకీర్తనచేయాలి. మహదానందంతో గెంతులు వేయాలి. భక్తి పారవశ్యంలో ఒళ్ళు మరచిపోయి క్రిందపడి మట్టిలో పొర్లాడాలి అనిపిస్తే, భేషుగ్గా చేయవచ్చు. తమ స్వంత ప్రార్ధనలు చేసుకొంటామన్న వాళ్ళ ఇష్టం. అంతేకానీ పాతకాలపు అరిగిపోయిన మంత్రాలు వల్లించడం నాకిష్టంలేదన్నారు. నా పూజా మందిరంలో ఇలా పూజలు చేయాలి, ఆలా పూజలు చేయాలనే నియమావళి తమకి నచ్చదన్నారు.

విగ్రహావిష్కరణ మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ దినం కాకూడదు.

ఆ రోజు స్వాగత దినం కావాలి ఎన్నో సార్లు చెప్పాను గతంలో.

నేను అవతరించింది - కర్మకాండలు తుడిచి వేయడానికేనని చెప్పాను.

ఏ మతానికి చెందినవయినా పూజలు, పునస్కారాలకి, కర్మకాండలకి స్వస్తి చెప్పడానికే అవతరించాను అని అంటూ బాబావారు, తాము అన్ని మతాలకీ అతీతులమని మరోసారి స్పష్టంచేశారు.

అహమ్మద్‌నగర్ నుంచి కొవ్వూరు ఎవరు వెడుతున్నారని అడిగారు.

ఆరుగురు చెప్పారు తాము వెడుతున్నట్లు. రుస్తుం కాకా కూడా కొవ్వూరు వెళ్ళాలని వుందన్నాడు. ఒంట్లో బాగాలేదుకదా! అంతదూరం ఎలా వెడతావు అన్నారు. మెహెర్‌స్థాన్ వెళ్ళాలన్న కోర్కె రుస్తుం కాకాకి గట్టిగా వుందని గ్రహించారు అందుకనే నువ్వూ వెళ్ళు అన్నారు. అయితే ప్రయాణం ఖర్చు అతగాడు భరిచలేడు కాబట్టి, నీ రాకపోకలకి డబ్బు ఇస్తాలే అన్నారు. హమ్మయ్య అని రుస్తుం కాకా ఊపిరి పీల్చుకున్నాడు.

ఆదీ, బరోడా మహారాణి శాంతాదేవిలను తమ ప్రతినిధులుగా మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవానికి పంపుతున్నామని బాబావారు శెలవిచ్చారు. ముంబాయి నుంచీ, పూనే నుంచీ కూడా కొవ్వూరు వెడుతున్నారు కొందరు. మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ వేడుక ఓ ప్రేమ పండుగ. కొవ్వూరు వెళ్ళండి ఆ ఆనందం పంచుకోండి అని అంటూ సెంటర్‌వారికి బాబావారు నగర్ సెంటర్ నుంచి ఛగన్, ఢాకే, భగరీథ్, కోకిలా, రంగోలె, మనేక్, కాకు, కామన్, మంధరేలని కొవ్వూరు పంపారు.

## 1963 మార్చి 1న మెహెర్‌స్థాన్‌లో జరిగిన గోష్ఠి

# మెహెర్‌బాబా కార్యక్రమాలు ఎలా చేపట్టాలి?



మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ కార్యక్రమానంతరం, ఆ మర్నాడు మార్చి 1న, ప్రేమిక సమ్మేళనం మెహెర్‌బాబా కార్యదర్శి ఆదీ కె ఇరానీ అధ్యక్షతన జరిగింది. ఈ సమ్మేళనంలో బాబా కార్యక్రమాలను ఏ రీతిన చేపట్టాలి, బాబా నామవ్యాప్తిని ఎలా కొనసాగించాలన్న విషయమై పలువురు బాబా ప్రేమికులు ప్రసంగించారు. బాబా కార్యక్రమాలను నిర్వహించడానికి అవసరమైన అనేక సలహాలు సూచనలు పలువురు బాబా ప్రేమికులు సూచించారు.

ఆనాటి వారి సూచనలు నేటికీ ఆమోదయోగ్యమే!

ఆ వివరాలను దయచేసి పరిశీలించండి.

**1. వింగ్ కమాండర్ మనోహర్ సాఖరే, ఢిల్లీ:-**

ఎ) వారం వారం సత్సంగ్ బి) ప్రేమికుల ఇళ్ళలో భజనలు, సత్సంగ్ సి) బాబా సందేశాలపై స్థానిక భాషల్లో కరపత్రాల ప్రచురణ, విరివిగా పంపిణీ జరపాలని సూచించారు.

**2) డా॥ హెచ్. పి. భరూచ్, నవసారి:-**

ఎ) ప్రతి బాబా సెంటర్‌లో బాబా సందేశాలు, సాహిత్యాన్ని క్షుణ్ణంగా చదివి ఆకళింపు చేసుకున్న ఒక వ్యక్తి సెంటర్‌లో గల ఇతరులను చైతన్యవంతుల్ని చేసేలా నెలలో ఒకటి రెండుసార్లు క్రమం తప్పక శిక్షణా తరగతులు నిర్వహించాలి. బి) బాబావారి సందేశాలు, **'ప్రేమ - సత్యం'** - బాబా ప్రేమికులు ఆచరణలో అమలు చేయగల్గాలి.

సి) దేశంలో గల అన్ని బాబా సెంటర్లు ఏడాదిలో ఒక మారైనా కలుసుకుని ఆయా సెంటర్‌లలో చేపడుతున్న పలు బాబా కార్యక్రమాలను సమీక్షించుకోవాలి. డి) ఆయా బాబా కేంద్రాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను మెహెర్‌బాబా పత్రికలకు ప్రచురణ నిమిత్తం పంపాలి. ఏడాదికోమారు నమోదైన ఈ కార్యక్రమాల విశేషాలను సమీక్షించుకోవాలి.

**డా॥ జి.ఎస్.ఎన్. మూర్తి, ఖరగ్‌పూర్ :-**

బాబా సందేశాలు దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేలా ఆదీజీ అన్ని ప్రాంతాలూ పర్యటించాలి.

**శ్రీ సోరాబ్‌జీ - ముంబాయి :-**

బాబా ప్రేమికులు అందరూ ఆయా సెంటర్‌లలో ఏర్పాటుచేసిన అన్ని కార్యక్రమాలకు హాజరుకావాలి.

**డా॥ సి.డి. దేశ్‌ముఖ్ - నాగపూర్ :-**

బాబా కార్యక్రమాల నిర్వహణకు కేవలం ఉత్సాహం ప్రధానం కాదు.

"ప్రేమ" - ప్రధానం అని మరువకూడదని హెచ్చరించారు. నిత్యజీవితంలో ప్రేమ పూర్వకంగా ఆప్యాయత, అనురాగాలు బాబా ప్రేమికులు అలవరుచుకోవాలని సలహ ఇచ్చారు. మెహెర్ సందేశాల వ్యాప్తికి మెహెర్ విశ్వవిద్యాలయం నొకదాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేయాలని సూచించారు. బాబా సందేశాలపై తరచు సమావేశాలు ఏర్పాటుచేయ్యాలన్నారు.

**శ్రీ పుకార్ - హమీర్‌పూర్ :-**

బాబా సందేశాలపై ప్రశ్నలు - జవాబులు కార్యక్రమం భేషైనదన్నారు.

'ప్రేమ'కు ప్రచారం అవసరం లేదు. ప్రతి సెంటర్ మెహెర్ క్షేత్రం కావాలన్నారు.

అభిప్రాయ బేధాలకు తావివ్వరాదన్నారు.

**శ్రీ కె. నారాయణరావు - ఏలూరు :-**

బాబా ప్రేమికులు ముఖ్యంగా మహిళలు చురుకుగా బాబావారి కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.

ముఖ్యంగా, బాబా సెంటర్‌ల నిర్వహణకు - నియమ నిబంధనలు ఏర్పాటు ప్రధానమన్నారు.



**శ్రీ అప్పల నాయుడు – బాపట్ల :–**

క్రొత్తగా ఏర్పాటయిన బాబా సెంటర్‌లకు బాబా సందేశాలతో కూడిన సాహిత్యం అందజేయ్యాలన్నారు.

**శ్రీ హరి జీవన్‌లాల్ – ఢిల్లీ :–**

బాబా సందేశాలపై ప్రముఖ వక్తలతో బహిరంగ సభల ఏర్పాటు, బాబా సందేశాల సాహిత్యం, బాబా చిత్రపటాలు విరివిగా ఉచితంగా పంపిణీ చేయాలని సూచించారు.

వ్యక్తిగత ఆర్భాటాలు కాక బాబా ప్రేమికులు అవతారుని సందేశాలపై ప్రసంగించాలన్నారు.

**స్వామీ సత్యప్రకాశ్ ఉదాశీన్ – కాకినాడ :–**

ముందుగా, బాబా కార్యక్రమాలు చేపట్టడానికి, బాబా సందేశాల వ్యాప్తికి అందుకు తాను అర్హుడా? కాదా? అని ప్రతి కార్యకర్త ప్రశ్నించుకోవాలన్నారు. బాబా ఏం చెప్పారు? తాను మేల్కొల్పడానికే కానీ, బోధించడానికి రాలేదని స్పష్టంగా చెప్పారు. అలాంటప్పుడు బాబా సందేశాన్ని తెలియజెప్పేందుకు మనం ఎంత మేర అర్హులం అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలన్నారు. కాబట్టి ముందుగా, మనం ఒకరినొకరం ప్రేమతో మసులుకోవడం అలవరుచుకోవాలని సూచించారు. మనలోవున్న బేధ భావాలు దూరం పెట్టాలన్నారు.

"**Let us be silent models of preaching**" అని సూచించారు. మెహెర్‌బాబా సందేశాలతో కూడిన ప్రచురణలు, కరపత్రాలు, ఫోటోలు విరివిగా పంపిణీ జరగాలన్నారు.



– స్వామీజీ సూచనలు – నూరు శాతం సరైనవని నాటి సమావేశంలో హాజరయిన వారందరూ అంగీకరించారు.

**శ్రీమతి హోమా మాలతి – పూనే :–**

తను స్వామీజీ అభిప్రాయాలతో అంగీకరిస్తున్నానన్నారు. అంతేకాదు, బాబా ప్రేమికులు నిరాడంబరతకు నిర్వచనంగా ఉండాలన్నారు. ప్రేమికులు తమ హెడ్ & హార్ట్‌లను బ్యాలెన్స్‌లో ఉంచుకోవాలన్నారు. మిత సంభాషణ మేలన్నారు.

**శ్రీ బాలనాటు – పూనే :–**

ప్రతి బాబా ప్రేమికుడు బాబా కార్యక్రమాలపై సరైన అవగాహన కల్గివుండాలన్నారు. **ఆత్మస్తుతి – పరనింద వలదన్నారు.**

**శ్రీ కిషోర్ మేస్త్రీ – ముంబాయి :–**

మెహెర్‌బాబా ప్రేమికులు తమ పిల్లలు అందరూ బాబా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు.

**శ్రీ ఆర్.పి. పంకరాజ్ – నాగపూర్ :–**

బాబా కార్యకర్తగా ప్రతి ప్రేమికుడు ముందుగా తనకు తాను సుశిక్షితుడు కావాలన్నారు. పదిమందితో కలిసి మెలిసి బాబా కార్యక్రమాలు చేపట్టేందుకు సంసిద్ధంగా వుండాలి.

**శ్రీ ధాకేఫాల్కర్ – అహ్మద్‌నగర్ :–**

ధాకేజీ నిక్కచ్చిగా మాట్లాడే వ్యక్తి, అవతార్ మెహెర్‌బాబాను ఈ యుగావతారునిగా, **Highest of the High** గా నమ్మి తరించిన వాడాయన.

బాబా సందేశాలను ఆచరణలో అమలు చేసేందుకు అనుక్షణం ప్రయత్నించేవాడిలో ధాకే ముఖ్యులు.

వ్యక్తిగతంగా తనకంటూ ప్రతి బాబా ప్రేమికుడు, బాబా కార్యక్రమాలు చేపట్టేమందు, మెహెర్‌బాబా పట్ల, ఆయన సందేశాల పట్ల ఒక నిర్దిష్టమైన నమ్మకం కల్గివుండాలన్నారు.

అప్పుడే ఎదుటివారి ప్రశ్నలకు ధీటైన జవాబివ్వగల్గుతామన్నారు.

బాబా సెంటర్‌తో మంచి సంబంధ బాంధవ్యాలు కల్గివుండాలి.

తానూ – బాబా సెంటర్ రెండు వేరుకాదన్న భావం మెండుగా కల్గివుండాలని ధాకే సూచించారు. బాబా కార్యక్రమాలు అప్పుడే విజయవంతమౌతాయన్నారు.

ఐతే, వ్యక్తిగత 'అహం' – కొన్ని సందర్భాలలో అడ్డుతగులుతుంది. సమయం, సందర్భాన్ని బట్టి, అహాన్ని అణుచుకోవాలి. తోటి ప్రేమికులందరితో సహకరిస్తూ – బాబా పనిలో ముందుకు సాగాలి.

**స్థానికులందరితో:–** బాబా కార్యక్రమాలు పలువురికి అందజేయాలన్న ఆశయం గల బాబా ప్రేమికులు స్థానికులందరితో తమ కుటుంబ సభ్యులతో మాదిరిగా కలిసిమెలిసి బాబా కార్యక్రమాలు చేపట్టాలి. అంతేకాదు బాబా సత్య ప్రేమ సందేశాలను ఆచరణలో అమలుచేస్తూ, బాబా ప్రేమ సిద్ధాంతానికి ప్రతీకగా నిలవాలి. అప్పుడే స్థానికులు ఆయా ప్రేమికులు చెప్పే బాబా సందేశాలను ఆలకిస్తారు. కనీసం ఆలోచించగల్గుతారు. స్థానికులతో బాబా విషయాలు సందేశాలు తెలియజేసేటప్పుడు కూడా ఆకర్షణీయంగా, చక్కని కథలతో వారిలో ఆలోచనలు రేకెత్తించేలాగా ప్రసంగించడం అలవరుచుకోవాలి.

ఆ దరిమిలా ఆదీజీ అందరికీ ప్రేమతో ఆలింగనం ఇచ్చారు.

ఒహో! ప్రేమికా! మెహెర్ ప్రేమికా – బాబ్జీ – కాకినాడ గీతంతో ఆనాటి కార్యక్రమం ముగిసింది.

సాయంత్రం 6.25 కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో విచ్చేసిన ప్రేమికులందరికీ వీడ్కోలు పలికారు.

అవతార్ మెహెర్‌బాబాకీ జై, జై జై నినాదాలుతో ఆకాశం ప్రతిధ్వనించింది.

# నోరి వారింట ఏకాహం, నగర సంకీర్తన

నోరి మెహెర్ చంద్, హైదరాబాద్ (92465 86261) వారింట ఏకాహం, నగర సంకీర్తన, సంత్సంగ్ కార్యక్రమాలు 2013 మార్చి 17, ఉ॥ 5 గం.ల నుండి రాత్రి 7 గం.ల వరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా తెల్లవారుఝామున నగర సంకీర్తన అనంతరం సా. 6 గం.ల నుండి 7 గం.ల వరకు బాబా భజన, సత్సంగ్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# స్వాగత గీతం

("వెలుగునీడలు" చిత్రంలో ఓహో రంగయో అనువరుస)

**రచన: బాబ్జీ**

ఓహో ప్రేమికా! మెహెర్ ప్రేమికా!
చేయి చేయి, కలిపి, స్వాగతంబు నీయవోయ్
ఆదియు, మహారాణీ శాంతాదేవి.....
అదుదెంచిరి, మెహెరుమూర్తి ప్రతిష్ఠంప... ॥ఓహో॥

తరతరాలు తరియించే, అవతారుని ప్రేమతోడ
బంధించిన ఆంధ్రులెంతో, ధన్యజీవులు.....
ప్రేమ కిదే చిహ్నముగా **"మెహెర్‌స్థాన్"** నిర్మించిన
కోడూరి దంపతులు వందనీయులు..... ॥ఓహో॥

గొఱ్ఱెపిల్లలను బోలిన, వెఱ్ఱి మెహెరు ప్రేమికుల
కబళించే కాంక్షతో, తోడేళ్ల గుంపులు
సాధురూపవర్తనులై, కపటవేషములు దాల్చి
వేధించే సమయమొచ్చె, ధిక్కరించవోయ్..... ॥ఓహో॥

అనవరతము ప్రియతముని, అడుగుజాడలందు మెలగి
తుదివరకూ కొంగువీడకుండ నుండగా
ఆచరణలో మెహెరు తత్వ మనుభవించి, ధీశక్తిని
రుజువర్తనమందు చూపి ప్రేమనందుకో..... ॥ఓహో॥

# ఆంధ్రా రెస్టుహౌసు – జీవిత సభ్యులు

ఆంధ్రా రెస్టుహౌస్‌లో జీవిత సభ్యత్వం చెల్లించిన బాబా ప్రేమికులందరూ తమ ఫొటోలను (భార్యా భర్తలు) వెంటనే పంపి తగిన ధృవీకరణపత్రం (సర్టిఫికెట్) పొందవల్సిందిగా కార్యదర్శి శ్రీ వై.ఎస్. రావు కోరుతున్నారు.

కాగా, ఆర్థిక స్థోమతగల బాబా ప్రేమికులు జీవిత సభ్యత్వం చెల్లించి ఆంధ్రా రెస్టు హౌసు అభివృద్ధికి సహకరించవల్సించవల్సిందిగా శ్రీ రావు కోరారు.

# వివాహం

శ్రీమతి పెణుజూరు సుజాతమ్మ, శ్రీ పెణుజూరు రమేష్ గార్ల కుమారుడు చి॥ కార్తికేయ వివాహము చి॥కుం॥సౌ॥ లలితతో 13.02.2012, బుధవారం ఉ.3 గం.ల నుండి ఉ.4 గం.ల లోపు, కర్నాటకం శ్రీ శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం, పాతవూరు, అనంతపురం నందు జరుగునట్లు ఆహ్వానం పంపినారు.

శ్రీమతి కాకి రత్న రమాదేవి, శ్రీ కాకి సాయిబాబు గార్ల కుమారుడు చి॥ మెహెర్ సుమన్ వివాహము చి॥ల॥సౌ॥ యోగ నాగ వెంకట పార్వతితో ది: 13.02.2013, బుధవారం రాత్రి 4.14 ని.లకు, వన్ ప్లేస్, కళామందిర్ ప్రక్కన, కె.పి.హెచ్.బి. మెయిన్‌రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్ నందు జరుగునట్లు ఆహ్వానం పంపినారు.

## పావగడలో బాబా సహవాస్ - వివాహం

శ్రీ ఎన్. చలపతిరావు, పావగడ, కర్నాటక తన నూతన గృహ ప్రవేశం 2013 ఏప్రిల్ 20న జరుప నిశ్చయించినట్లు తెలిపారు. అలాగే, ఆ మర్నాడు అంటే ఏప్రిల్ 21న తన కూమార్తె చి.ల.సౌ.సోనియా వివాహం చి. కె.ఎన్. సునీల్‌తో అవతారుని ప్రార్థనలతో ఎలాంటి కర్మకాండలూ లేకుండా జరుపుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తమ ఇంట ప్రేమిక సహవాస్ 20-4-2013 ఉ. 5 నుండి సా. 5 వరకూ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీ చలపతిరావు (094803 10374) సంప్రదించగలరు.

# చిరునామాల తొలగింపు

గత రెండేళ్ళుగా వార్షిక సభ్యత్వం చెల్లించని సభ్యుల చిరునామాలను 2013 ఫిబ్రవరి సంచిక నుండి తొలిగించడమైనది. **జీవితసభ్యత్వంలో రూ 500 మాత్రమే చెల్లించినవారు వారి రెండవ విడత నగదును త్వరలో చెల్లించవలెనని మనవి. దయచేసి బాబా ప్రేమికులు సహకరించగలరు.**

# హెల్ప్ లైన్

మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 19 లేదా 20 తేదీలలో సికింద్రాబాద్‌లో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీ నాటికి పత్రిక మీ ముంగిట వుంటుంది. పత్రిక అందుటలో ఆలస్యమైతే శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492-42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు.

# శ్రీ కోడూరి కృష్ణారావు



**శ్రీ కోడూరి కృష్ణారావు 1899 సెప్టెంబరు 21 పశ్చిమ గోదావరి జిల్లాలో జన్మించారు. తల్లి శ్రీమతి రత్నాంబ, తండ్రి శ్రీ సుబ్బారావు.** వీరికి ఐదుగురు కొడుకులు, ఒక కుమార్తె. ఆ సంతానంలో శ్రీ కృష్ణారావు రెండవవాడు.

కృష్ణారావు కొవ్వూరులో హైస్కూలు వరకు చదువుకున్నాడు. ఆ తర్వాత కాకినాడ, రాజమండ్రి, మద్రాసులో ఉన్నత చదువుల కోసం వెళ్ళాడు. స్వాతంత్ర్య పోరాటపు రోజులవి. గాంధీజీ పిలుపునందుకొని చదువులు వదిలిపెట్టి శ్రీ కృష్ణారావు రాజమండ్రిలో సహాయ నిరాకరణోద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు.

శ్రీ కళా వెంకట్రావు (మాజీ మంత్రి) ఆయన అంతేవాసి.

ఆ దరిమిలా ప్రజా జీవితంలో అడుగిడిన శ్రీ కోడూరి కృష్ణారావు **జిల్లా బోర్డు అధ్యక్షులుగా** ఎన్నికయ్యారు.

అదే సమయంలో ఉమామహేశ్వర ప్రైవేటు బస్సు సర్వీసు,

కొవ్వూరు – రాజమండ్రిల నడుమ గోదావరి నదిలో భవానీ శంకర్, ఉమా శంకర్, గౌరీ శంకర్ పేర్లతో మోటారు లాంచీ సర్వీసులు వ్యాపారం వీరికి వుండింది.

వ్యాపారంలో లాభాలు ఎంత దండిగా వచ్చాయో అదే రీతిలో దానకర్ణుడుగా కీర్తిగడించాడు కృష్ణారావు.

పేదల కోసం ధారాళంగా ఖర్చుచేసేవాడిగా, బడుగుల పక్షపాతిగా ప్రఖ్యాతి చెందాడాయన. అదేసమయంలో ఆధ్యాత్మికంగా పట్టిసీమలోని వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి, రాజమండ్రిలోని మార్కొండేయ, కోటిలింగాల క్షేత్రాలకు, ద్రాక్షారామంలోని శివాలయాల అభివృద్ధికి కృష్ణారావు ఇతోధికంగా సహాయం అందించారు. శ్రీ కృష్ణారావు మెహెర్‌బాబా పరిధిలోనికి రాక పూర్వం ఆయన పరమ శివభక్తుడు. మహాశివరాత్రి పర్వదినాన ఊరూ-వాడా అన్నట్లు అన్నదానం చేసేవాడు. స్వామీ శివానంద గోదావరి జిల్లా పర్యటనకొచ్చిన సందర్భంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించాడీయన.

నిత్యం దైవ నామస్మరణలో గడుపుతుండే శ్రీ కృష్ణారావు తన ఆరాధ్యదైవమైన పరమశివుడిని అవతార్ మెహెర్‌బాబాలో దర్శించుకున్నాడు. 1953 జనవరిలో తొలిసారిగా మెహెర్‌బాబా ఆంధ్ర పర్యటనలో భాగంగా కొవ్వూరులో పర్యటించినప్పుడు శ్రీ కోడూరి బాబాను దర్శించుకున్నాడు. మౌనావతారుడి పర్యటనలో శ్రీ కోడూరి చురుకుగా పాల్గొన్నాడు.

తన తొలి దర్శనంలోనే శ్రీ కోడూరి మెహెర్‌బాబాలో తన ఇలవేల్పును దర్శించుకున్నాడు.

1954 ఫిబ్రవరిలో రెండవసారి మెహెర్‌బాబా కొవ్వూరు సందర్శించినప్పుడు కోడూరి బాబాకు ఆతిథ్యం ఇచ్చారు. గోదావరి లాంచీలలో మెహెర్‌బాబాకు, ఆయన మండలి సభ్యులందరకూ ఒక అపూర్వమైన ఆతిథ్యం ఆయన ఇచ్చారు.

రెండవసారి మెహెర్‌బాబా కొవ్వూరు పర్యటన రోజున ఏం జరిగిందనుకున్నారు. ఆ రోజు మహాశివరాత్రి పర్వదినం. ఆ పర్వదినాన శ్రీ కృష్ణారావు తన ఆరాధ్య దైవం మెహెర్‌బాబాకు అపూర్వరీతిలో ఆతిథ్యమిచ్చారు. ఆ రోజున శ్రీ కృష్ణారావు సుమారు పదివేల మందికి అన్నదానం నిర్వహించారు. ఎత్తైన అన్నపురాశులు, వంటకాలపై మెహెరుడు తన అమృత హస్తాన్ని వుంచి తన ప్రసాదంగా ఆశీర్వదించారు.

ఆ దరిమిలా కృష్ణారావుగారికి బాబా నామస్మరణ నిత్యకృత్యమయింది. తన ఆధ్యాత్మిక జీవన పథంలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమయింది. ఏ ప్రాంతంలో ఎక్కడ బాబా కార్యక్రమాలు జరుగుతున్నా కృష్ణారావు చురుకుగా పాల్గొన్నాడు.

ఎందరో బాబా ప్రేమికులకు అనేక విధాల సహాయం అందించాడు. 1955లో బాబా సహవాస్ కార్యక్రమ నిర్వహణకు తగిన ఆర్థిక సహాయం తన ప్రేమికుల నుండి బాబా కోరినప్పుడు ఒకసారి రూ.1500/-, మరోసారి రూ. 1000/- అందజేశాడు.

ఆ రోజుల్లో వెయ్యి రూపాయల విలువ ఎక్కువే కదా!!

అలాగే భగద్వచనం **(GOD SPEAKS)** గ్రంథాలను కొనుగోలు చేయమని బాబా కోరినప్పుడు కూడా, శ్రీ కోడూరి కృష్ణారావు వెయ్యి రూపాయలతో గ్రంథాలను కొని, వాటిని ఆధ్యాత్మిక జిజ్ఞాసగల వారందరికీ ఉచితంగా అందజేశారు. ఆ మాదిరిగా




కృష్ణారావు దగ్గర భగవద్వచనం పొందినవారి జాబితాలో మాజీ ముఖ్యమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ నీలం సంజీవరెడ్డి, శ్రీ కళా వెంకట్రావు తదితరులున్నారు.

కృష్ణారావు తన బంధువర్గాన్నెందరికో బాబా దర్శనం ఇప్పించారు.

బాబా నామవ్యాప్తికి ఇతోధికంగా కృషిచేశాడు.

తన బంధు మిత్రుల కోసం టూరిస్టు బస్సులు ఏర్పాటుచేసి బాబావారి దర్శనార్థం వారిని మెహెరాజాద్, మెహెరాబాద్‌లకు తీసుకెళ్ళాడు. రాజమండ్రి నుండి ప్రత్యేక రైలు బోగీలు ఏర్పాటుచేసి పెనుకొండ, తాడేపల్లిగూడెం, యాదవోలు, రాజమండ్రి, ధవళేశ్వరం, కేశవరం, శ్రీరంగపట్నం, కొవ్వూరు, రాజమండ్రి, తుని, పాలకొల్లు, రేలంగి, రాఘవపురం, ఇలా ఒకటేమిటి అనేక ప్రాంతాల నుండి తన బంధువుల్ని, స్నేహితులతోపాటు, బాబా దర్శనం ఆశించే ప్రతి ఒక్కరికీ బాబా దర్శనం, పాదస్పర్శ భాగ్యం కల్గచేసిన పుణ్యజీవి శ్రీ కృష్ణారావు.

బాబా దర్శనార్థం తీసుకెళ్ళే ధూమ శకటాన్ని కూడా రంగ రంగ వైభవంగా బాబా చిత్రపటాలతో, సప్తవర్ణ పతాకాలతో అలంకరించి తీసుకెళ్ళాడని ఆనాటి రచయితల రచనల ఆధారంగా తెలుస్తోంది. ఆ మాదిరిగా ఎందరికో బాబా దర్శన భాగ్యం కల్పించాడు కోడూరి. ఆనాటి గోదావరి పుష్కర ఉత్సవాలలో కూడా బాబా ప్రేమిక సహవాస్, భజనలు, కీర్తనలు, ఛాయాచిత్ర ప్రదర్శన, బాబావారి సాహిత్య ప్రచురణలు, ఫోటోలతో స్టాలు ఏర్పాటు చేశాడని పలువురు తెలియజేశారు. ఆనాటి సమావేశాలకు డా॥ సి.డి. దేశ్‌ముఖ్ నాగపూర్ వంటి వారిని ఆహ్వానించి బాబా సందేశాలను పలువురికి వినిపించాడు.

మెహెర్‌బాబా ఎందరో సాధు సజ్జనుల్ని, మహాత్ముల్ని, మస్తుల సాంగత్యం చేశారు. బాబా తన రెండవసారి కొవ్వూరు పర్యటనలో స్థానికంగా గల నవభారత్ గురుకులంలో ఒక మౌన స్వామి బాబాను కలిసాడు. బాబా ఆ మౌన స్వామిని 45 రోజులపాటు ఉపవాసం ఉండమని ఆదేశించారు. ఆ సమయంలో రెండు కప్పుల పాలు త్రాగొచ్చన్నారు. ఇతని బాగోగుల్ని శ్రీ కోడూరిని చూడమన్నారు. అదేసమయంలో **'పరబ్రహ్మ – పరమాత్మ'** నామజపం చేయమన్నారు.

ఇందుకు బాబా ఓ ఐదుగురు ప్రేమికుల్ని ఎంపికచేసి, వారందర్నీ ఒక వారం రోజులు మౌనంగా ఉపవాసం వుండమన్నారు. **ఆ ఐదుగురిలో కృష్ణారావు కూడా వున్నారు.**

బాబావారిచ్చిన ఈ ఆదేశాలను తు.చ. తప్పక పాటించి విజయవంతంగా బయటకొచ్చారు కృష్ణారావు. ఆ సమయంలోనే కృష్ణారావు మదిలో బాబా విగ్రహం – కొవ్వూరులో మెహెర్‌స్థాన్ ఏర్పాటు చేయాలనే సంకల్పం కల్గింది.

ఈ విషయం బాబాకి తెలియజేస్తే అందుకు ఆయన అంగీకరించ లేదు.

ఇప్పటికే ఊరూవాడా ఎన్నో దేవాలయాలు, ఆధ్యాత్మిక సంస్థలు, సమాజాలు ఉన్నాయి. ఇవన్నీ మానవాళిని అనేక ఇక్కట్లుకు గురిచేస్తున్నాయి. మళ్ళీ మరో నూతన ఆలయమా అని కోడూరివారి విన్నపాన్ని బాబా సున్నితంగా తిరస్కరించారు.

ఐతే, కృష్ణారావు పలుమార్లు చేసిన అనేక విజ్ఞాపనలకు ప్రేమావతారుడు కాదనలేక, తొలుతగా కొవ్వూరులో 75 రోజులుపాటు బాబా నామజపం చేయమని ఆదేశించారు.

స్థానిక ప్రేమికులు రెట్టింపైన ఉత్సాహంతో ఆ కార్యక్రమాన్ని చేపట్టి, విజయవంతం చేశారు. 75 రోజుల నామజపంలో ఆఖరి రోజున కృష్ణారావు గారి భార్య రత్నమ్మ తాదాత్మ్యంలో యావత్తు మానవాళికోసం ఈ ప్రదేశంలోనే పవిత్ర ఆలయం నిర్మించాలని అన్నట్లు, అవి అవతారుని ఆజ్ఞగా కోడూరి స్వీకరించారని చెప్తారు.

ఈ 75 రోజుల్లో రోజుకి నూరుమంది బాబా ప్రేమికులతోపాటు, నిత్యం ఎందరో స్థానిక పేదవారికి నిత్యాన్నదానం శ్రీ కోడూరి చేశారు. కొవ్వూరులో జరుగుతున్న నామజప సమాచారం సమస్తం ఎప్పటికప్పుడు బాబాకు తెలియజేశారు.

**ఆ దరిమిలా కోడూరివారి చిరకాల కోర్కె – కొవ్వూరులో మెహెరుడి విగ్రహ ప్రతిష్ఠాపన, మెహెర్‌స్థాన్ ఏర్పాటుకు 1958 జూలైలో బాబా తన ఆనతి ఇచ్చారు.**

ఐతే, ఈ మహానిర్మాణంలో భాగంగా కృష్ణారావు సొంత నిధులే ఖర్చుచేయ్యాలని, ఎవ్వరి దగ్గరా విరాళాలు తీసుకోవద్దని బాబా ఆదేశించారు.

ఈ భక్తుని మదిలోనూ ఇదే కోరిక వుండి వుంటుంది.

అందుకే కృష్ణారావుని స్థానిక పెద్దలు ఎవరూ మోహమాట పెట్టకుండా – సర్వాంతర్యామి – బాబా ఆ రీతిని ఆదేశించివుంటారు – సుమీ!!

బాబా విగ్రహ నిర్మాణాన్ని **తలాం స్టూడియో – ముంబాయికి** అప్పగించారు.

నేడు మెహెర్‌స్థాన్‌లో మనం చూస్తున్న విగ్రహం కోసం భౌతికంగా – బాబా తన కొలతలు తీసుకోడానికి తలాం స్టూడియో వారికి స్వయంగా సహకరించారు.

బాబా పాదాలు, చేతుల కొలతలు ఆ శిల్పి తీసుకున్నాడు.

మట్టితో ఆ పిదప మైనంతో విగ్రహ నమూనాలు పూర్తయ్యాక, బాబా కార్యదర్శి ఆదీ.కె.ఇరానీతో పాటు పలువురు బాబా ప్రేమికులు ముంబాయి వెళ్ళి, నిర్మాణంలో వున్న బాబా విగ్రహ నమూనాన్ని చూసివచ్చారు.

తొలుత ఈ విగ్రహాన్ని ఇటలీ దేశపు పాలరాతితో రూపొందించాలనుకొన్నారు. ఇందుకు ఒక యూరోపియన్ ప్రేమికుడు తగిన పాలరాయిని ఉచితంగా అందిస్తానన్నాడు.

కానీ, ఆ రాయిని తిరిగి మన దేశంలో దిగుమతికి అవసరమైన అనుమతులు ఇతరత్రా దృష్ట్యా ఆ ఆలోచన విరమించుకున్నారు.

నేడు మనం చూస్తున్న కాంశ్య విగ్రహం కోసం రు. 17,000/- (1960 వ దశకంలో) కృష్ణారావు ఖర్చు చేశారు.

మెహెర్‌స్థాన్ నిర్మాణం కోసం, శంకుస్థాపన కార్యక్రమాన్ని 1960 ఫిబ్రవరి 25గా ఖరారు చేశారు. ఈ తేదీని కూడా అవతార్ మెహెర్‌బాబా స్వయంగా నిర్ణయించారు.

**1960, ఫిబ్రవరి 25.**

ఆనాడు అవతారుని జన్మదినం అయింది. అంతేకాదు, మహాశివరాత్రి పర్వదినం కూడా అయింది. ఆ పరమేశ్వరుడు - ఈ పరాత్పర పరబ్రహ్మ - మెహెర్‌బాబా ఇద్దరూ ఒక్కరేనని తెలియజెప్పేలా 1960 ఫిబ్రవరి 25 తెల్లవారుఝూమున 5 గంటలకు - బాబా జన్మకాల సమయంలో, శంఖుస్థాపన మహోత్సవం వైభవంగా జరిగింది.

డిసెంబరు 1961లో ఆదీజీ, జాల్‌భాయి, మెహెర్‌స్థాన్‌పై శిఖర ప్రతిష్ఠ చేశారు.

ఆనాడు మెహెర్‌స్థాన్ నిర్మాణం కోసం రమారమిన లక్ష రూపాయలు పైగా ఖర్చుచేశారని ఒక అంచనా. మెహెర్‌స్థాన్ శిఖర భాగాన హిందూ దేవాలయం, చర్చి, మసీదులతో పాటు జొరాష్ట్రియన్ల అగ్ని దేవాలయ చిహ్నాలు ఏర్పాటు చేశారు. బాబాకు ఎదురుగా కూర్చుని భజనలు కీర్తనలు ఆలాపన చేసే ప్రేమికుల కోసం బాబావారి గదికి ఎదురుగా 80 అడుగుల పొడవు 40 అడుగుల వెడల్పు గల విశాలమైన హాలు నిర్మాణం చేశారు.

ఇవికాక మెహెర్‌స్థాన్ చుట్టూతా సువిశాల విస్తీర్ణంలో ఎన్నో పచ్చని చెట్లు, వృక్షాలు నేడు దర్శనమిస్తున్నాయి.



శ్రీ కోడూరి ప్రసాద్ మెహెర్‌స్థాన్ నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు.

## అతిథి గృహం

నిత్యం ఎందరో బాబా ప్రేమికులు అనేక దూరాభారాలకు ఓర్చి మెహెర్‌స్థాన్‌కు విచ్చేస్తున్న వారిని దృష్టిలో పెట్టుకుని శ్రీ కోడూరి మెహెర్‌స్థాన్ ప్రాంగణంలోనే రెండు గదుల అతిథి గృహాన్ని ప్రత్యేకంగా బాబావారి అనుమతితో నిర్మించారు.

ఈ అతిథి గృహాన్ని బాబావారి 71వ జన్మదినం రోజున 1965 ఫిబ్రవరి 25న ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బాబా తన ప్రేమికులు సరోష్ -విలూలను ప్రత్యేకంగా

పంపారు. శ్రీ కోడూరికి, అలాగే యావన్మంది బాబా ప్రేమికుల కోసం బాబా తన జన్మదిన సందేశం ఇలా ఇచ్చారు.

**Be true to the trust I repose in you and remember Me wholeheartedly. My Love and Blessing to you**

**ఆ దరిమిలా శ్రీ కోడూరి మెహెరస్థాన్ ప్రాంగణంలో పేదల కోసం ఒక ఆసుపత్రి, పిల్లల కోసం ఒక స్కూలు నిర్మించాలనుకున్నారు.**

**కానీ వారి కోరిక నెరవేరకుండానే...1965 నవంబరు 11న అకస్మాత్తుగా తీవ్ర గుండెపోటుతో శ్రీ కోడూరి అవతారునిలో ఐక్యమయ్యారు.**

ఈ సమాచారాన్ని స్థానిక బాబా ప్రేమికులు శ్రీ శివుడు శివరావు గారు మెహెర్‌బాబాకు ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం పంపారు.

ఆ వెనువెంటనే మెహెర్‌బాబా ఒక తంతిలో తనకి ఎంతో ఇష్టమైన కోడూరి తనను సంతోషంగా చేరాడన్నారు.

ఆయన అంత్యక్రియలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించి, ఆయన అస్థికలను మెహెర్‌స్థాన్ ప్రధాన భవనాలకు ఆవలగా, మెహెర్‌స్థాన్ ప్రవేశ ద్వారానికి ప్రక్కగా ఉంచమని బాబా ఆ తంతిలో సూచించారు.



కృష్ణారావు గారి భార్యకు, కుటుంబ సభ్యులందరికీ తన ప్రేమను అందజేస్తున్నానని, దిగులు చెందవద్దని బాబా అన్నారు.

మెహెర్‌బాబా ఆదేశాల మేరకు శ్రీ కోదూరి వారి సమాధి మెహెర్‌స్థాన్ ప్రవేశానికి ముందు, ఒక ప్రక్కగా నిర్మించారు. మెహెరుడి ప్రేమను నిండుగా పొందిన ఆ మహనీయుని సమాధిని మనం నేడు మెహెరస్థాన్‌లో చూడవచ్చు.

**XXX 0700 1 KOVVUR W.G. 11 16 PTY**
**Received here at 9:45 AM**
**MEHERBABA AHMEDNAGAR**

***Krishnarao reaching 4 a.m.***
***Left today heart failure***

**-Shivarao**



**Express Koduri Prasad,**
**Meherstan, Kovvur, E.G. Andhra**

My dear Koduri Krishnarao has come to me to rest happily in my love so don't worry stop you all be brave and be resigned to divine will stop proceed with customary cremation and final rites for the body and bury asthi ashes in Mehershan compound outside the main building but nearby Mehersthan entrance stop My love blessing to Ratnamma to you and parivar.

**- Meherbaba**

**Express Ratnamma c/o Koduri Prasadarao,**
**Mehersthan, Kovvur,**
**W.G. (Dt. A.P)**

Your dear husband Koduri Krishnarao love for me and his servece in the cause of the Avatar have made him immortal Krishnarao now lives eternally in Me and he is blissfully happy I want you to be brave and to keep happy in Krishnarao happiness My love blessing to you and to your dear children

**- Meherbaba**

**Express Dhanapathyrao,**
**Avtarmeher Kakinada**
**(E.G. Dt. A.P.)**

Inform all My lovers in Andhra that Koduri Krishnarao was one of my dearest lovers and has come to rest eternally in me.

**-Meher baba**

**తమ చిరకాల మిత్రుడైన శ్రీ కోదూరి మృతి పట్ల బాబా మండలి సభ్యుడు ఏరుచ్ తన సంతాపం తెలుపుతూ టెలిగ్రాం ......**

**Express Koduri Prasadarao Mehersthan Kovvur,**

Great is the pain to part with a great lover of Meherbaba but feel comforted in knowledge that our very dear Koduri Krishnarao has eventually reached Mehersthan his goal to rest eternally in his beloved Avatar Meherbaba **- Eruch**

**తమ చిరకాల మిత్రుడైన శ్రీ కోదూరి మృతి పట్ల బాబా మండలి సభ్యుడు తన సంతాపం తెలుపుతూ ఆదీ కె ఇరానీ టెలిగ్రాం పంపారు.**

**Koduri Prasadarao, Mehersthan, Kovvur**

Deeply pained hear dear Krishnaraos passing away stop Yourself Ratnamma should draw comfort Krishnarao rests eternally peaceful in infinite heart of Baba. **-Adi Irani**

***** From " The Awakener" Magazine, Val.-XI, No.4, Page.26.**



## ద్విభాష్యం బాబాలో ఐక్యం

శ్రీ ద్విభాష్యం వెంకట సత్యనారాయణ మూర్తి, (డి.వి.యస్), విశాఖ, 18.01.2012న బాబాలో ఐక్యమయ్యారు. మెహెర్‌బాబా సాహిత్యాన్ని ఆసాంతం ఆకళింపు చేసుకున్న బాబా ప్రేమికునిగా, మెహెర్ సాహిత్యంలో అనేక గ్రంధాలు రచించిన గొప్ప రచయితగా శ్రీ ద్విభాష్యం బాబా ప్రేమికులందరకూ సుపరిచితులు.

## క్రొత్త సి.డి

బాబా ప్రేమికులు, చింతా సర్వారావు, విజయవాడ శతజయంతి సందర్భంగా – ఆయన ఆలాపించిన బాబా ప్రార్ధనలు (ద్విపదతో) అవతార్ మెహెర్‌బాబా జీవిత సంగ్రహాన్ని ఆయన మనుమడు శ్రీ చింతా సర్వారావు ఒక సి.డి. రూపంలో రూపొందించాడు. ప్రతివారు 'చింతా' వారి ప్రార్ధనలు ఒకమారు వినితీరాలి! సి.డి.ల కోసం విజయవాడ బాబా సెంటర్‌ను సంప్రదించగలరు.

# అర్థ శతాబ్ధిలో...




**గత 50 సంవత్సరాల** మెహెర్‌స్థాన్ (ప్రస్థానంలో ఎన్నో మధురానుభూతులు చోటుచేసుకున్నాయి. 1963 ఫి(బవరి 28న మెహెర్‌స్థాన్ (ప్రారంభించిన విషయం పాఠకులకు విదితమే. ఆ పిదప సుమారు రెండున్నర సంవత్సరాలకే (శ్రీ కోడూరి మెహెరునిలో ఐక్యమయ్యారు.

1965 నుండి సుమారు ఒక(టెండు దశాబ్దాలు మెహెర్‌స్థాన్‌లో అనేక చురుకైన బాబా కార్య(క్రమాలు నిర్వహించారు. కానీ 1980 నుండీ తిరిగి 1999 వరకు మెహెర్‌స్థాన్‌లో బాబా కార్య(క్రమాల నిర్వహణ దాదాపు నత్తనడకగా కొనసాగాయని చెప్పాలి. కొన్ని రోజుల్లోనైతే స్థానిక మత్స్యకారుల నిత్య కార్యకలాపాలకు ఆలవాలమైంది. ఇది చాలా బాధాకరం. ఈ విషయం బాబా (ప్రేమికుల్ని చాలా ఆందోళనకు గురిచేసింది. ఈ సమయంలోనే (శ్రీ కె.నారాయణరావు, రాజమం(డి, (శ్రీ తోట పద్మనాభరావు, (శ్రీ (ప్రసాదరాజు, కాకినాడ, తదితరులు (శ్రీ కోడూరి కృష్ణారావు గారి కుమారుడు (శ్రీ (ప్రసాద్ గారి సలహా సం(ప్రదింపులతో మెహెరాజాద్ వెళ్ళి, మండలి సభ్యులైన ఏరుచ్, అలోబాలను కలిసారు. ఆ పిదప రా(ష్ట్రంలో గల తెలుగు బాబా (ప్రేమికులందర్నీ సంఘటితం చేసారు. (ప్రతినెలా రా(ష్ట్రంలో గల ఒక్కొక్క జిల్లాలో గల ఆయా బాబా సెంటర్ల తరపున బాబా (ప్రేమిక సహవాస్‌లు (క్రమం తప్పక నిర్వహించారు. ఈ (ప్రయత్నం మంచి ఫలితాలిచ్చింది. 2001 నుండి మెహెర్‌స్థాన్‌లో పలు బాబా కార్య(క్రమాలు విశేషరీతిలో జరుగుతున్నాయి. మెహెర్‌స్థాన్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఏడాది పొడుగూతా సత్సంగ్‌లు (ప్రత్యేక సహవాస్ కార్య(క్రమాలు జరిగాయి. ఈ నడుమ మెహెర్‌స్థాన్ ఎదురుగా రెండు అంతస్థుల ధర్మశాల నిర్మాణం జరిగింది. ధర్మశాల నేడెందరికో భోజన, వసతి సౌకర్యం కల్పిస్తోంది. ఏది ఏమైనా గత 50 సంత్సరాల మెహెర్‌స్థాన్ (ప్రస్థానంలో జరిగిన అనేక విషయాలు ఒకింత ఆనందం మరో(ప్రక్క ఆందోళన, విస్మయాల్ని కల్గజేసాయి. నేటి తరం ఆధ్వర్యంలో అవతారుని దివ్యాశీశ్శులతో రాబోయే 50 సంవత్సరాలు ఎంతో దివ్యంగా, వైభవోపేతమైన అవతారుని కార్య(క్రమాలు మెహెర్‌స్థాన్‌లో జరుగనున్నాయని ఆశిద్దాం!!

# అమర్‌సింగ్ సైగల్



అమర్‌సింగ్ సైగల్ పార్లమెంటు సభ్యునిగా, భారత ప్రధాని పండిట్ నెహ్రూకు అత్యంత సన్నిహిత స్నేహితునిగా బాబా ప్రేమికులందరికీ బాగా తెలుసు. కొవ్వూరు మెహెర్‌స్థాన్ ప్రారంభోత్సవ వేడుకలకు రైల్లో వెళ్తూ తన తోటి ప్రయాణీకులైన డాక్టర్ హెచ్. పి. భరూచా తదితరులకు తనకు సంబంధించిన ఒక విషయాన్ని శ్రీ సైగల్ ఇలా చెప్పారు. ఇకపై ఆయన మాటల్లో ...

ఆ రోజుల్లో నేను ఢిలాసేపూర్‌లో వుంటున్నాను. నా స్నేహితుని ఇంటికి వెళ్ళినప్పుడు వారి ఇంట్లో బాబా ఫోటోనొకదాన్ని చూసి కళ్ళు తిప్పులేకపోయాను. ఆ ఫోటో నన్నెంతగానో ఆకర్షించింది. ఆ తర్వాత ఆ ఫోటో గురించి, మెహెర్‌బాబా గురించి అడిగి తెలుసుకుని, అప్పటి నుండి బాబాను దర్శించుకోవాలని ఎదురుచూడసాగాను. ఇంతలో పూనేలో బాబాని దర్శించుకునే అవకాశం చిక్కింది. వారం రోజులు సెలవు తీసుకున్నాను. ఢిల్లీ నుండి బాబా దర్శనార్థం పూనే వెళ్ళాను.

బాబా దర్శనం చేసుకున్న తొలి రోజునే బాబా నన్ను వెళ్ళిపొమ్మనమని ఆజ్ఞాపించారు. మారుమాట్లాడకుండా ఢిల్లీకి వెళ్ళిపోయాను. ఆఫీసుకి వెళ్ళి చూస్తును కదా! రెండు అర్జంట్ ఫైళ్ళు నా టేబుల్‌పై వున్నాయి. వాటిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణం క్లియర్ చేయ్యాలి. అప్పుడు అర్థమయింది! బాబా నన్నెందుకు తక్షణం తిరిగి వెళ్ళిపొమ్మన్నారో!

ఆయన సర్వేశ్వరుడు.

మహిమలు చేయనని చెబుతూనే మెహెర్‌బాబా తన భక్తులను ఆపదలలో ఆదుకుంటాడని సర్దార్‌జీ డా.భరూచాతో అన్నారు.

# పండగమ్మా పండగే

**పల్లవి.. పండగమ్మా పండగే**
మెహెరు దేవుడు అండనుండ
బ్రతుకు అంతా పండగే ॥పండగమ్మా॥

ఎన్ని పండగలొచ్చినగాని
ఎన్ని పూజలు చేసినగాని
ఎన్ని నోములు నోచినగాని
ఎన్ని వ్రతములు సలిపినగాని
ప్రేమహృదితో మెహెరుని కొలవని
బ్రతుకు అంతా దండగే... ॥పండగమ్మా॥

సందడిగ సహవాసులలోన
మెహెరు ప్రేమిక కలయిక పండగే
మెండుగా శ్రీమెహెరుని నామం
కీర్తించిన రోజొక పండగే... ॥పండగమ్మా॥

నిండుగా శ్రీ మెహెరుని మదిని
తలచిసాగిన రోజొక పండగే
మెహెరు జన్మ వేడుకలందు
ప్రభుని కీర్తన పండగ పండగే ॥పండగమ్మా॥

పదుగురొకటై మెహెరుని చరితము
ప్రస్తుతించిన రోజొక పండగే
అమరతిథి రోజందరూ కలసి
మెహెరు సన్నిధి గడపిన పండగే ॥పండగమ్మా॥

రండి జనులారా రండి
మెహెరుదేవుని చెంతకు రండి
నిండు పున్నమి చందురుడండి
ప్రేమ పంచే ప్రియతముడండి
ప్రేమ వెన్నెలవెలుగులలోన
మెహెరు పండగ చేదము రండి ॥పండగమ్మా॥

రచయిత శ్రీ కె.వి. రమణ, హైదరాబాద్, (90009 46485), ఈ పాట గురించి చెబుతూ నేటికి ఈ పాట రాసి 20 సంవత్సరాలు నిండిందన్నారు. విశాఖలో ఉండే రోజుల్లో ఓ రోజున నాగుల చవితి పండుగ సందర్భంగా మహిళలు క్రొత్త దుస్తులు ధరించి క్యూలో నిల్చుని పుట్టలో పాలుపోస్తుండటం చూసి నా మనస్సు ఇలా స్పందించిందన్నారు. దాంతో **ఎన్ని పండుగలు వచ్చినగాని, ఎన్ని పూజలు చేసినగాని, ఎన్ని నోములు నోచినగాని, ప్రేమ హృదితో మెహెరుని కొలువని, బ్రతుకు అంతా దండగే అని** పదాలు సమకూర్చానన్నారు. ఈ పాటతో నన్ను చాలామంది **"పండుగ రమణ"** అని పిలుస్తున్నారు. ఆ పిదప సుధాకర్ భార్గవ్, హైదరాబాద్ (93924 29067) ఈ పాటతో సి. డిలు రూపొందించారని తెలిపారు.

# సాములోర్లతో తస్మాత్! జాగ్రత్త!

ఓ సమావేశంలో బాబా ఒక సందేశంలో తన ప్రేమికులందరినీ
జాగ్రత్తగా వుండండన్నారు.
దొంగ స్వాములున్నారని హెచ్చరించారు.
ఇప్పటికే ఉత్తర భారతంలో, అలాగే చాలాచోట్ల కొందరు
తమకుతాముగా మెహెర్‌బాబా వారసులమని ప్రకటించుకున్నారన్నారు.
కొందరు బాబా ప్రతినిధులమంటూ బాబా ప్రేమికులను మోసగిస్తున్నారన్నారు.
అలాంటి **సాములోర్లతో తస్మాత్! జాగ్రత్త!** అని బాబా చమత్కరిస్తూ
తన ప్రేమికులను మోసపోవద్దని హెచ్చరిస్తూ
ఆనాటి సమావేశాన్ని ముగించారు.

*****

**బాబా ప్రేమికుడు బాబ్జీ తన స్వాగత గీతంలో !!!**
**ఓహో ప్రేమికా! మెహెర్ ప్రేమికా!**
**గొఱ్ఱెపిల్లలను బోలిన,**
**వెఱ్ఱి మెహెరు ప్రేమికుల**
**కబళించే కాంక్షతో, తోడేళ్ల గుంపులు**
**సాధురూపవర్తనులై, కపటవేషములు దాల్చి**
**వేధించే సమయమొచ్చె,**
**ధిక్కరించవోయ్..... ॥ఓహో॥**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

**ప్రేమాశ్రమం పున: ప్రారంభం:**

మార్చి రెండవ తేదీన ప్రేమాశ్రమాన్ని తిరిగి తెరిచారు. ఎన్ని రోజులు నడుస్తుందో మాత్రం తెలీదు. బాబావారి ప్రణాళిక ఎవరికి తెలుసు కనుక. ఇదిగో ఫలానా రోజు వరకు ఇక్కడ వుంటానని బాబావారు ఎప్పుడూ చెప్పలేదు ఎవరికీ! మెహెరాబాద్‌లో ఒకటా రెండా ఎన్నో ఏర్పాట్లు చేశారు. స్కూళ్ళున్నాయి. ఆస్పత్రి వుంది. వచ్చిపోయే వారికోసం దర్మశాల వుంది. చెట్లు, పూల తోటల ఆలనా పాలనా చూడటానికి చాలా మంది వున్నారు. దాంతో రోజూ ఏదో ఒక హడావుడి. కానీ ఈ మధ్య బాబావారు మెహెరాబాద్ బాధ్యతలని తగ్గించుకొంటున్నారు. ఒక్కొక్కటిగా అన్ని పనులపైనా తెరదించుతున్నారు. ఎందుకు చేస్తున్నారిలా?

స్కూలు, పిల్లల ద్వారా చేస్తున్న ఆధ్యాత్మిక పని పూర్తవుతోంది కామోసు. అందుకనే బాబావారు ఇక్కడ ఎక్కువ రోజులు వుండకపోవచ్చు. ఈ అభిప్రాయం బలపడటానికి మరో కారణం వుంది. అది పురుష మండలికి పురమాయించిన పనులు. ఛాన్జీ, రావ్ సాహెబ్‌లు బొంబాయి వెళ్ళారు. మీ రచనలని ప్రింటింగ్ చేయించండని బాబావారే పంపారు. ఇహ బువా సాహెబ్, బెహెరామ్‌లని వాళ్ళ ఇళ్ళకి అంటే పూనే పంపారు. పాద్రీ, ఎడ్కె, మాసాజీ, కైఖుస్రూ, మాసా, బాబూ సైకిల్‌వాలా నాసిక్‌లో వున్నారు. బైదుల్, అర్దషీర్‌లు బొంబాయికి వెళ్ళారు.

రావ్ సాహెబ్ రచన 'సత్య శోధన' పుస్తకాన్ని బొంబాయి మహానగరంలో అమ్మమన్నారు ఆ ఇద్దరితో. సరే క్వెట్టా వెళ్ళిన పెండూ ఇంకా రాలేదు. అక్కడే ఏదో పనిలో సతమతమవుతున్నాడు. ఇలా, ఈ ప్రకారంగా పురుష మండలి పెద్దలు చాలా మంది మార్చి, ఏప్రిల్ నెలలో మెహెరాబాద్ బయటే వున్నారు.

మనిషి చనిపోతే స్వర్గానికి వెడతాడా? నరకానికి వెడతాడా? ఎవరు దిశా నిర్దేశం చేస్తారీ ప్రయాణానికి. అలాగే సూక్ష్మ స్థితిలో స్థూల సంస్కారాలు ఎలా వుంటాయి? వాటి ప్రభావం ఏ ప్రకారంగా వుంటుంది?

ఈ ప్రశ్నలకి సమాధానం మార్చి ఆరవ తేదీన దొరికింది.

స్వర్గం, నరకం అన్నవి రెండు వేర్వేరు స్థితులని బాబావారు చెప్పారు. చేసుకొన్నవాడికి చేసుకొన్నంత మహదేవా అన్నట్లు, సంస్కారాలను బట్టి స్వర్గమో, నరకమో దొరుకుతుందిట.

బాబావారీ మాటను ఎంతో చక్కగా వివరించారు. మరిన్ని మంచి సంస్కారాలు చనిపోయిన వ్యక్తికి సొత్తు అయితే, వెంటనే స్వర్గానికి వెడతాడు. అక్కడ అతని సంస్కారాలకి తగ్గ ఫలం దొరుకుతుంది. అంటే స్వర్గ సుఖాలు దొరుకుతాయి. ఇది ఎలా సాధ్యం. శరీరం లేకుండా సుఖాలు ఎలా అనుభవిస్తాడు? స్వర్గధామ స్థితి సూక్ష్మ ప్రపంచపు స్థితి. అందువల్ల శరీరంతో పనిలేదు. ఇలానే చెడ్డ సంస్కారాలు ఎక్కువగా వుంటే నరకానికి వెడతాడు మనిషి. ఆ సంస్కారాలకి తగ్గ ఫలితం అనుభవిస్తాడు.

ఈ అనుభూతికీ శరీరం అక్కర్లేదు.

అటు స్వర్గానికి వెళ్ళినా, ఇటు నరకమే ప్రాప్తమయినా కూడా ఏమవుతుంది?

మంచి సంస్కారాలని అనండి, చెడు సంస్కారాలని అనండి అవి తుడిచిపెట్టబడతాయి. అయితే వాటి ముద్ర పూర్తిగా పోదు. కొంచెం లీలగా కన్పిస్తుంది. ఎక్కడ? మనస్సుపైన. ఇవే ఈ మిగిలిపోయిన సంస్కారాల మరకలే సూక్ష్మ సంస్కారాలు అని బాబావారు చెప్పారు.

వేదాంతమంటే సులువైన సంగతిని అర్థం కాకుండా చెప్పండమని బాబావారే చెప్పారొకసారి. మండలివారికి అటువంటి చేదు అనుభవం ఎదురుకాకూడదని కామోసు. బాబావారు సూక్ష్మ సంస్కారాల గురించి చాలా వివరంగా చెప్పారు.

వంటపాత్ర ఒడిలో పడితే ఏమవుతుంది అని అడిగారు. అన్నం గిన్నె కానీ, పప్పు, కూరల గిన్నె కానీ ఏ వంట గిన్నె ఒడిలో పడినా ఏమవుతుంది. బట్టలు కరాబు అవుతాయి. వెంటనే లేచి నిలబడి, బట్టలు దులిపేస్తే? ఏముంది మీద పడిన అన్నమో, కూరో, పప్పో క్రింద పడుతుంది. కానీ బట్టలకి అంటిన మరక పోతుందా? పోదు. సంస్కారాల విషయంలోనూ ఇంతే అన్నారు బాబా. లేచి నిలబడి బట్టలు దులిపేసుకోవడం, స్థూల సంస్కారాలు అయితే, బట్టకి పట్టిన మరక సూక్ష్మ సంస్కారాలు అని బాబావారు వివరించారు. ఇంకోమాట చెప్పారు. చనిపోయాక కూడా రెండు మూడు రోజుల పాటు సంస్కారాలు ఎక్కడికి పోవట. చనిపోయిన చోటనే వుంటాయట. సంస్కారాలు రెండు – మూడు రోజులపాటు అలానే మరో పది – పన్నెండు రోజులపాటు కూడా సంస్కారాలు ఖర్చయిపోవట. మనిషి స్వర్గానికి వెళ్ళినా, నరకానికి వెళ్ళినా, అతని సంస్కారాలు పది – పన్నెండు రోజులపాటు ఖర్చు కావని బాబావారు స్పష్టం చేశారు.

ఎంతో జటిలమైన స్వర్గ నరకాల గురించి ఎందరో గురువులు సద్గురువులు ఎన్నోసార్లు చెప్పారు. ఎవరు ఎన్నిసార్లు ఎన్ని రకాలుగా చెప్పినా, మూల విషయం ఒక్కటే. అందులో ఏ మార్పూ లేదు. మరి వారు చెప్పిన దానికి, బాబావారు చెప్పిన సంగతులకీ తేడా వుందా! అంటే వుందనాలి. నేను బోధించుటకు రాలేదు. మేల్కొలుపుటకే వచ్చాను అన్న మెహెర్‌బాబావారు ప్రతి విషయాన్నీ, అది ఏదో ఆషామాషీ సంగతిలా చెప్తారు. సందేహాలకీ,

సంశయాలకీ ఆస్కారం వుండదు అవతారుని ఉవాచ వింటే. ఈవేళ మార్చి ఆరవ తేదీన చెప్పిన మరణానంతర స్థితి గురించే తీసుకోండి. ఎంత చక్కగా చెప్పారు. ఎంత వివరంగా చెప్పారు. సూక్ష్మ సంస్కారాన్ని మరకతోపోల్చి, నిఘంటువు అవసరం లేకుండా చేశారు.

ఇలా ఎన్నో విషయాలని – అధ్యాత్మిక సంగతుల్ని ప్రేమాశ్రమ పిల్లలకి రోజూ చెప్పారు బాబావారు. మే నెలలో దేశాటనికి వెడుతున్నారు కాబట్టి మార్చి, ఏప్రిల్ రెండు నెలలు పిల్లలతో ఎక్కువ సేపు గడిపారు. పిల్ల గోపికలకి కావల్సింది ఇంకేమి కావాలి కనుక. బాబావారి కనుసన్నల్లో వుండటమే వారి కోరిక. అడగకుండానే ఆహారాన్ని ఇచ్చాడు అవతారుడు ఆ రెండు నెలలూ. భగవత్ప్రేమ పొంగి పొర్లింది. మనస్సు భగవత్ప్రేమ సుధరసంతో నిండిపోయింది. రాజారామ్ అయితే మార్చి 18వ తేదీ నాటికి భగవదోన్మతుడయ్యాడు. సుమారు గంటన్నర సేపు పరిసరాలు పట్టలేదు. అసలు వాడు మన స్పృహలో లేడు. ఈ లోకంలోకి పడ్డాక కూడా మామూలు మనిషి కాలేదు. కళ్ళు శూన్యంగా వున్నాయి. ఎవరితోనూ మాట్లాడనన్నాడు. ఏమి పెట్టినా తినడానికి మనసుపడలేదు. మూడు రోజులపాటు ఒంటికి ఏమయిందీ పట్టలేదు.

మనుషుల్లో పడ్డాక కూడా చాలా రోజులపాటు అదోలా కనిపించాడు. వీడు బ్రతికే వున్నాడా అన్న అనుమానం వచ్చింది చూసేవాళ్ళకి. రాజారాం వాలకం చూస్తుంటే దస్తూర్‌కి అనిపించింది వీడుకూడా అబ్దులా స్థాయికి ఎదిగాడేమో, అందుకనే ప్రాణం వుండీ లేనివాడిలా కన్పిస్తున్నాడు అనుకొన్నాడు. ఆ మాటే బాబావారితో అన్నాడు. అబ్దుల్లా ఆరవ భూమికని చేరిన అదృష్టవంతుడు. వీడిని కూడా ఆ అదృష్టం వరించిందా అని అడిగాడు. బాబావారు అదేమీ లేదన్నారు. రాజారామ్ అప్పుడే చేరలేదు ఆరవ భూమికకి అని తేల్చి చెప్పారు. వీడింకా బహుదూరపు బాటసారి ఆధ్యాత్మిక మార్గంలో అన్నారు.

భగవదోన్మత్తుడు కావటం వల్ల పరంధాముడు సన్నిధిలో దొరికే దివ్యాను భూతిని కొంచెం రుచి చూశాడు అన్నారు. ఆ కాస్తకే మూడు రోజులు అమితానందపడ్డాడని చెప్పారు. ఈ అదృష్టం రాజారామ్‌కి బాబావారి దయవల్ల చిన్న వయస్సులోనే దొరికింది.

మరి, రాజారామ్‌కి ఇప్పుడు దొరికిన అనుభూతి ఎంతకాలం వుంటుంది. ఎప్పుడూ వాటిని అంటిపెట్టుకొని వుంటుందా? ఈ ధర్మ సందేహం కూడా దస్తూర్ మహాశయుడిదే. ఎంతయినా ఇప్పుడాయన మెహెర్ మెసేజ్ పత్రిక యజమాని కదా. ప్రశ్నలు రావటం, వెంటనే ప్రశ్నలు వేయటం పత్రికా వృత్తి ధర్మం మరి. బాబావారి సమాధానం దస్తూర్ బుర్రకి పదునుపెట్టింది.

స్థూల ప్రపంచంలో ఎండమావి అన్న అనుభూతి రాజారామ్‌కి కల్గింది అన్నారు. స్థూల ప్రపంచం అంటే చరాచర జగత్తు, ఈ ప్రపంచాన్ని మాయ కప్పివేసి వుంటుంది కదా ఆ మాయ తెరని త్రెంచుకు వెళ్ళాలి. అలా చేయాలంటే, ఈ స్థూల ప్రపంచం ఎండమావి తప్ప మరోకటి కాదని తెలుసుకోవాలి.

ఈ స్థూల ప్రపంచంలో ఎండమావి అన్న దివ్యానుభూతి రాజారామ్‌కి ఎప్పుడూ వుండవచ్చు, వుండకనూ పోవచ్చు. చెప్పలేం అన్నారు. కానీ, ఈ స్థూల ప్రపంచంలో ఎండమావి అన్న భావన మాత్రం చెరగదు అన్నారు. ఎప్పుడూ గుర్తుంటుంది అన్నారు. ఒకవేళ రాజారామ్‌కి ఈ అనుభూతి పోయినా నష్టం లేదన్నారు. ఇంకో దివ్యానుభూతి దొరుకుతుంది. అది ఎండమావి అన్న అనుభూతి కంటే గొప్పది. అందువల్ల రాజారామ్‌కి లాభమే జరుగుతుంది. ఎందుకంటే వాడి ఆధ్యాత్మిక యాత్ర వేగం పుంజుకొంటుంది కాబట్టి అని బాబావారు చెప్పారు.

మార్చి 28వ తేదీన మండలి వారొకరు ఓ ధర్మ సందేహం లేవనెత్తారు. భగవంతుడు తప్ప ఇంకెవరూ లేరని కదా బాబావారు అంటారు. మరి అలాగయితే కళ్ళకి కనిపిస్తున్న వాటి సంగతి ఏమిటి? అవి వున్నా లేవని ఎట్లా అనగలము? అని అడిగాడు. "నువ్వు చెప్పింది నిజమే కాదనను కానీ భగవంతుడు తప్ప మరెవ్వరూ లేరన్న సంగతి నిజమేనంటానన్నారు బాబా. చరాచర జగత్తులో భగవంతుడొక్కడే సత్యము, నిత్యము అని స్పష్టం చేశారు.

ఈ చిదంబర రహస్యం అంతుచిక్కని ఆ మండలి పెద్ద మనిషి మరో ప్రశ్న వేశాడు. మీరు చెప్పింది నిజమే కావచ్చు బాబా. కానీ కళ్ళ ముందు కనిపిస్తున్నది కాదని ఎలా అంటారు. మిమ్మల్ని కళ్ళారా చూస్తున్నాను. నా కళ్ళని నమ్మవద్దని ఎలా అంటారు. నా కళ్ళకి కనబడుతున్నది సత్యం కాదా! అలానే నా సంగతే తీసుకోండి. ప్రాణంతో వున్నాను. మీ ముందు కూర్చొన్నాను. ఇది శరీరం కాదని, ఈ శరీరం అసలు ఇక్కడ లేదనీ ఎలా అనగలరు బాబా అని అడిగాడు. మీ స్పందన ఏమిటి అన్నాడు.

నీకెందుకీ గొడవ అనలేదు బాబా. ఎంత చెప్పినా నీ బుర్రకెక్కదు. వాటి జోలికి పోకు అని అతడిని మందలించనూ లేదు, సరికదా చాలా ఓపికగా సృష్టి విచిత్రాన్ని వివరించారు. స్థూల ప్రపంచపు అస్తిత్వం మనస్సుకి సంబంధించిన సంగతే. మనస్సు పనిచేస్తున్నంత సేపూ, స్థూల ప్రపంచం వున్నట్లు అనిపిస్తుంది. కళ్ళు మూసుకొని గాఢ నిద్రలోకి జారితే స్థూల ప్రపంచం ఏమన్నా పట్టుందానీకు. నీ చుట్టూరా ఏమున్నాయో నీకు తెలుస్తుందా నిద్రలో? తెలీదు కదా! అంటే మెళుకువుగా వున్నపుడు కళ్ళకి కనిపించాయని, అవి శాశ్వతమయినవనీ చెప్పగలవా? అంటే ఆయా పదార్థాల ఉనికి ఒక భ్రాంతి. నీ మనస్సు సృష్టించిన భ్రాంతి అని బాబావారన్నారు. భ్రాంతి అంటే అర్థం కావడానికి ఓ చక్కని ఉదాహరణ ఇచ్చారు. అంతా కటిక చీకటి. కన్ను పొడుచుకొన్నా ఏమీ కనబడట లేదు. అప్పుడు నువ్వు బయలుదేరావు. చీకటిలో నడుస్తున్నావు. ఎదురుగా ఏదో కనిపించింది లీలగా. ఒక్కసారి ఒళ్ళు గగుర్పొడిచింది. అడుగు ముందుకు పడలేదు. ఎదురుగా వున్నది ఓ మనిషి, వీడు దొంగాడులా వున్నాడే అనిపించింది. అంతే ఇహ ఎక్కడలేని భయం పట్టుకొంది. ఇంతలో అదృష్టవశాత్తూ, ఎవరో అటుగా వస్తారు. మీరిద్దరూ ఆ దొంగని

పట్టుకోవాలనుకుంటారు. చప్పుడు చేయకుండా అడుగులు వేస్తూ ఆ ఆగంతకుడి దగ్గరకు వెళ్తావ్. చితకబాదుడు మొదలెడ్తావ్. ఎంత కొట్టినా అతగాడు ఉలకడు పలకడు. వీడికి ఏమయింది అనుకొని తేరిపారా చూస్తావ్. వెంటనే అరే ఎంత పొరపాటు చేశానని ముక్కున వేలు వేసుకొంటావు. ఎందుకని ఇంతవరకూ నువ్వు కొట్టింది దొంగని కాదు. ప్రాణంలేని బండరాయిని.

నీ మనస్సు కేమనిపించింది, వాడెవడో దొంగ అని. వాడు దొంగేనా? కాదు. ప్రాణం లేని రాయి. బండరాయి. అది నీకు అంటే నీ మనస్సుకి తెలీదు. నీ మనస్సుకి తెలీకపోయినంత మాత్రాన రాయి దొంగ కాలేదు. రాయిలో మార్పులేదు. మార్పు వచ్చింది నీ మనస్సులోనే. అవునంటావా అని బాబావారు ఎదురు ప్రశ్నవేశారు.

ఈ చర్చకి తెరపడుతుందని కొందరనుకొన్నారు. కానీ తెర పడలేదు. ఎందుకంటే కళ్ళకి కన్పిస్తున్న పదార్థం నిజం కాదు, అబద్ధం అని అనుకోమంటే ఎవరు ఒప్పుకొంటారు చెప్పండి? అందుకనే మరో మండలి పెద్ద ఇలా అడిగాడు.

బాబా! ఇదిగో ఇక్కడ స్టూలు వుంది చూశారు కదా. చెక్క స్టూలు ఇది. అది అక్కడ కన్పిస్తుంటే, అది నిజం కాదు అని ఎలా అంటారు. అది మీ దృష్టిలో ఓ పదార్థం కావచ్చు. నా దృష్టిలో ఈ స్టూలు కూడా ఒక ఆత్మ. ప్రాణి. కానీ మీరు ఈ జగత్తులో ఏ పదార్థం లేదు. అంతా శూన్యం. భగవంతుడొక్కడే సత్యం. మిగిలింది అంతా మిథ్య అంటున్నారు. మీమాట నాకు అర్థం కావటం లేదన్నాడు.

బాబావారు అతని ప్రశ్నకి స్పందిస్తూ, తమ చిన్నప్పటి సంఘటన ఒకటి చెప్పారు. అప్పట్లో పూనాలో వుంటున్నప్పుడు, కైఖుస్రూ అని ఓ ఇరానీ స్నేహితుడు వుండేవాడు. ఐస్‌క్రీం తయారుచేసి అమ్మేవాడు. వాడికో చెడ్డ అలవాటుండేది. గంజాయి కలిపిన పాలు త్రాగేవాడు. గంజాయి కలిపిన పాలనే భంగ్ అంటాడు. దాన్ని త్రాగితే మత్తు ఎక్కుతుంది. ఒకరోజున ఏమయింది, బాగా భంగ్ పట్టించి, ఐస్‌క్రీం అమ్మడానికి బయలుదేరాడు. కొంత దూరం పోయేసరికి ఓ నీటి గుంట కనిపించింది. అర అడుగు వెడల్పు లేదు. కానీ అదో పెద్ద మడుగు అనుకొన్నాడు. దీన్ని దాటటం ఎలాగ? దూకితే పోదూ అనిపించింది. మడుగు దూకాలంటే మాటలు కాదు కదా. దూకేవాళ్ళు ఏం చేస్తారో తెలుసుగా మీకు. పరుగెడ్తూ వచ్చి ఎగిరి గెంతాడు. పది పడుగుల అవతల పడ్డాడు. ఇదీ భంగ్ మత్తులో అరడుగు వెడల్పులేని గుంట దాటడానికి నా మిత్రుడు చేసిన నిర్వాకం.

అది నీటి మడుగు కాదు. చిన్న నీటి గుంట అని నువ్వు చెప్తే, కైఖుస్రూ నీ మాట వినేవాడా? నీ మాట పెడచెవిని పెట్టేవాడు సరికదా నిన్ను ఓ పిచ్చివాడిగా జమ కట్టేవాడు. ఎందుకని వాడికి ఆ నీటిగుంట మడుగు అనిపించింది. కాబట్టి అది మడుగు క్రిందే లెక్క వాడికి. నీకు ఇది స్టూలు అనిపించినట్లే, వాడికి అది పెద్ద మడుగు అనిపించింది. కానీ నాకు అలా కాదే. నీవు ఏది స్టూలు అని అనుకొంటున్నావో, ఏది ఫలానా పదార్థం

అనుకొంటున్నావో, నా దృష్టిలో వాటికి అస్తిత్వం లేదు. అందుకనే అవి లేవు అని అంటాను. గాఢ నిద్రలో నీకు చుట్టుప్రక్కల వస్తువులు, ప్రాణులు వున్నా లేనట్లే లెక్క వాటి ఉనికి నీకు తెలీదు. అలాగే నేను నిద్రపోకుండా మెళుకువుగా వున్నా కూడా వాటి ఉనికిలేదు నా వరకూ. గాఢ నిద్రావస్థలో మీది ఎరుకలేని స్థితి. ఆ స్థితిలో ఏ అనుభూతిని మీరు పొందుతారో అటువంటి అనుభూతిని, భగవత్ సాక్షాత్కారం పొందిన మేము జాగ్రదావస్థలో పొందుతాము అన్నారు.

మా జాగ్రదావస్థ – అంటే మెళుకువగా వుండే సమయం. మీరు మెళుకువగా వుండటం ఒకటే కాదు. మాది యదార్థమైనది. కాగా మీది నిజమైన జాగ్రదావస్థ కాదు. బ్రహ్మైక్యం లభించినప్పుడు మీకే తెలిసివస్తుందీ వైనం. మనస్సు ఉండబట్టే పదార్థం వుంది.

మనస్సు మాయమైతే పదార్థం కూడా అంతం అవుతుందన్నారు.

ఈ చర్చ జరిగిన రెండు రోజులకి బాబావారు నాసిక్ వెళ్ళారు. అక్కడ స్త్రీ మండలి వుంటున్న సంగతి పాఠకులకి తెలుసు కదా. వారంతా బాబావారి దర్శనం కోసం కళ్ళు కాయలు చేసుకొని ఎదురు చూస్తున్నారు. మెహెరాబాద్‌లో వుంటే బాబావారి కనుసన్నల్లోనే వుండేవాళ్ళం. ఇక్కడికి వచ్చాక బాబావారి దర్శనం కరువయింది. బాబావారిని సేవించి తరించే భాగ్యానికి దూరమయ్యామని మధన పడుతున్నారు.

మీకెందుకు చింత మీ చెంత నేనుండగా అన్నట్లు బాబావారు నాసిక్‌లో నెలరోజులకి పైనే వున్నారు. ఏప్రిల్ 3వ తేదీన మెహెరాబాద్‌కి తిరిగి వచ్చారు. ధూలియాలో మనేకర్‌కి ఉద్యోగం వచ్చింది. వెంటనే వచ్చి చేరమనటంతో, మార్చి నెలాఖరుకే అతను ధూలియా వెళ్ళాడు. ఏప్రిల్ ఒకటిన రష్యన్ ఋషి, సాధూలీక్ గారు దేశాటనకి బయలు దేరాడు. ఈ పని పురమాయించింది బాబావారే. భారతదేశం చుట్టిరా. బాబావారి గురించి నలుగురికీ చెప్పు అని ఆదేశించింది మౌనమూర్తే. అయితే గమ్మత్తు ఏమిటీ అంటే సాధూలీక్ గారు మెహెరాబాద్ నుంచి కదిలేసరికి బాబావారు నాసిక్‌లో వున్నారు. మరి మన రష్యన్ మహాశయుడికి బాబావారి దర్శనం మళ్ళా దొరికిందా? ఈ ప్రశ్నకి సమాధానం ముస్ముందు దొరుకుతుంది. ప్రస్తుతానికి లీక్‌గారు మహదానందంగా వున్నాడు. బాబా వారప్పగించిన పనిని సవ్యంగా, సజావుగా నిర్వర్తించాలి. అలా, ఆ ప్రకారంగా ప్రభు సేవలో పండిపోయే వీలుకల్పించ మని మనీసా బాబావారిని ప్రార్థించాడు. ఇతనొక ధన్యజీవి. కల్మషం లేని ప్రేమ ఇతనిది. ఫలాపేక్ష లేని భక్తి అతనిది. ఏప్రిల్ 11న బాబావారు నగర్‌కి వెళ్ళారు. ఉదయం ఐదింటికే నగర్ దారి పట్టారు. ఎప్పటిలాగా ఈవాళ కూడా నౌసేర్వాన్ సాథా ఇంటికి అంటే అక్బర్ ప్రెస్‌కే వెళ్ళారు. అక్కడ కాసేపు కూర్చొని నేషనల్ హైస్కూలుకి వెళ్ళారు. అక్కడ పిల్లల కోసం హాస్టల్ పెట్టారు. హాస్టల్ భవనానికి బాబావారు ప్రారంభోత్సవం చేశారు. పిల్లల్ని దీవించారు. చీకటి పడేసరికి మెహెరాబాద్ తిరిగి వచ్చారు.

– సశేషం

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్ధిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశనములేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.

మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,

అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మావు,
పరమాత్మవు, అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# చిత్రమాలిక

ఫోటోలు పంపినవారు..
శ్రీ కె. నారాయణరావు, శ్రీ రామకృష్ణ, రాజమండ్రి



తుదిమెరుగులు దిద్దుకుంటున్న మెహెర్‌స్థాన్ నిర్మాణం..1963 ఫిబ్రవరి.






ఆనాటి ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్న ముఖ్యఅతిథులు



సభలో ప్రసంగిస్తున్న కవి, యోగి సుద్ధానంద భారతి

## జీవిత సభ్యతం - 2013 జనవరి-ఫిబ్రవరి నెలలో పంపిన వారి వివరాలు

| | | | |
|---|---|---|---|
| 0 | ఫిబ్రవరి | యస్. కృష్ణమూర్తి, విశాఖపట్నం | రూ. 1000/- |
| 1 | ఫిబ్రవరి | డి. కోటి అప్పారావు, విశాఖపట్నం | రూ. 1000/- |
| 2 | ఫిబ్రవరి | డా॥ ఎ.ఎస్. ఆచార్య, విశాఖపట్నం | రూ. 1000/- |
| 3 | ఫిబ్రవరి | జె. శరత్‌బాబు, కొవ్వూరు | రూ. 500/- |
| 4. | ఫిబ్రవరి | ఎన్. కోటేశ్వరరావు, ఏలూరు | రూ. 1000/- |
| 5. | ఫిబ్రవరి | మేడమ్ నరసింహులు, కామారెడ్డి | రూ. 250/- |
| 6. | ఫిబ్రవరి | హరినాథ్ గుప్త, కదిరి | రూ. 1000/- |
| 7. | ఫిబ్రవరి | బి. కృష్ణనాయక్, కదిరి | రూ. 500/- |
| 8. | ఫిబ్రవరి | హరి ప్రసాద్, హిందుపూర్ | రూ. 500/- |
| 9. | ఫిబ్రవరి | సి.ఆర్. గుప్త, అనంతపూర్ | రూ. 500/- |
| 10. | ఫిబ్రవరి | డి. శ్రీనివాసులు, ధర్మవరం | రూ. 1000/- |
| 11. | ఫిబ్రవరి | ఎ. రామసుబ్బయ్య, కదిరి | రూ. 1000/- |
| 12. | ఫిబ్రవరి | వి. జయలలిత, ధర్మవరం | రూ. 1000/- |
| 13. | ఫిబ్రవరి | పి. యాకాంబరం, వరంగల్ | రూ. 200/- |
| 14. | ఫిబ్రవరి | కె. శ్రీనివాసరావు, తెనాలి | రూ. 500/- |
| 15. | ఫిబ్రవరి | అక్కమ్మ, కర్ణాటక | రూ. 500/- |
| 16. | ఫిబ్రవరి | ఆర్. ఉమాదేవి, బెంగుళూరు | రూ. 500/- |
| 17. | ఫిబ్రవరి | యం. సంగమేశ్వరరావు, విజయనగరం | రూ. 500/- |
| 18. | ఫిబ్రవరి | జి. సీతారామస్వామి, విజయనగరం | రూ. 500/- |
| 19. | ఫిబ్రవరి | యం.ఆర్. శర్మ, కర్నూల్ | రూ. 500/- |
| 20. | ఫిబ్రవరి | ఎస్. సాంబయ్య, హైదరాబాద్ | రూ. 1000/- |
| 21. | ఫిబ్రవరి | వి. శ్రీనివాస్, హైదరాబాద్ | రూ. 1000/- |
| 22. | ఫిబ్రవరి | ఎ. గోవర్ధన రెడ్డి, నిజామాబాద్ | రూ. 1000/- |
| 23. | ఫిబ్రవరి | ఎన్. శ్రీనివాస్, శ్రీకాకుళం | రూ. 1000/- |
| 24. | ఫిబ్రవరి | కె. శ్రీనివాసరావు | రూ. 1000/- |
| 25. | ఫిబ్రవరి | ఎ. నరసింహులు, హైదరాబాద్ | రూ. 500/- |
| | | **మొత్తం** | **రు. 18,950/-** |

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**

